17 కౌంటింగ్ సెంటర్లు..



17 కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో హాల్‌లోనూ 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో రౌండ్‌లోనూ 14 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈవీఎంలను లెక్కిస్తారు. పార్లమెంట్ పరిధిలో ఈవీఎం ఓట్ల లెక్కింపునకు 98 టేబుళ్లు ఉంటాయి.ఇక్కడ 116 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు. అసెంబ్లీ పరిధిలో 98 టేబుళ్లు ఉంటాయి. ఇక్కడ 116 రౌండ్లలో లెక్కిస్తారు. ఈటీపీబీఎస్ కోసం 4 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్‌కు 20 టేబుళ్లు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్లను లెక్కించడానికి ఏడుగురు సహాయ రిటర్నింగ్ అధికారులు, 119మంది సూపర్‌వైజర్లు, 126 మంది సహాయకులు, 140 మంది సూక్ష్మపరిశీలకులు, 119 మంది ఇతర సిబ్బంది ఉంటారు. కౌంటింగ్ కేంద్రాల్లో 24 గంటలూ పనిచేసేలా 152 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో 7 సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 2 కిలోమీటర్ల పరిధిలో పర్యవేక్షణకు 10 డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఓటు.. పవర్!



- ఓటరు ఎటువైపో..అధికారం అటువైపే
- మార్పు కోరుకున్న జనం.. ఎగ్జిట్‌పోల్స్‌లో వెల్లడి
- దేశ..విదేశాల చూపు ఏపీ ఎన్నికల వైపు
- జనంలో జోరుగా సాగుతున్న చర్చ
- జారుకుంటున్న వైసీపీ బెట్టింగ్‌బాబులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. రేపే ప్రజా తీర్పు వెలువడనుంది. మూడు నెలల తీవ్ర ఉత్కంఠకు సమాధానం రానుంది. తమ ఆకాంక్షలు నెరవేర్చే 'మార్పు' కోసం ఓటరు ఆశగా ఎదురు చూస్తున్నాడు.ఓటు తన పవర్‌ని చూపించే తరుణం ఇంకా గంటలు మాత్రమే ఉండడంతో జన సందోహంలో చర్చ తారస్థాయికి చేరింది. ఎన్నికల బరిలో ఎన్నో రాజకీయ పార్టీలు, స్వతంత్రులు నిలిచినా రెండు ప్రధాన పార్టీల నడుమే పోరు భీకరంగా సాగిందనేది బహిరంగ వాస్తవం. జిల్లాలోని పార్లమెంట్ స్థానంలో 12 మంది, అసెంబ్లీ స్థానాల్లో 71 మంది పోటీలో ఉన్నారు అయితే 16 మంది గెలుపు ఓటములపైనే ఓటర్లు దృష్టి సారించారు. ఎన్నికల షెడ్యూల్ ముందు నుంచీ గంభీరం ప్రదర్శించిన అధికార పార్టీ.. పోలింగ్ తర్వాత గుంభనంగా మారిపోయింది. ఎగ్జిట్ పోల్స్ సర్వేలు కూటమి విజయం ఖాయమని వెల్లడించడంతో ఆ నాయకులు మరింత మదనపడుతున్నారు. మరో వైపు బెట్టింగ్ బాబుల గుండెల్లో సైతం రైళ్లు పరుగెడుతున్నాయి. ఎగ్జిట్‌పోల్ ఫలితాలతో చాలా మంది అయోమయంలో పడి పోయారు. కూటమి అభ్యర్థులు, అభిమానుల్లో మాత్రం ఆనం దం మొదలైపోయింది.

ఎన్నడూలేని ఉత్కంఠ..

రాష్ట్రం అగాథంలో కూరుకుపోయింది. ఇటీవల పల్నాడులో చెలరేగిన అరాచకాలను రాష్ట్రం ఎన్నడూ చూడలేదు. దీంతో దేశంలోని పలు రాష్ట్రాలకు ఎన్నికలు జరిగినా ఏపీవైపే అందరి కళ్లూ చూస్తున్నాయి. అమెరికాతో సహా వివిధ దేశాల్లో ఏపీలో ఫలితాలపైనే చర్చ నడుస్తోంది. ఏ ఇద్దరు తెలుగువారు కలుసుకున్నా ఏపీలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే అంశంపైనే మాటలు సాగుతున్నాయి. ఐదేళ్ల రాష్ట్రం చీకటిలోకి జారుకోవడం, అరాచకాలు, అవినీతి, అక్రమాలు హద్దు మీరడం. సామాన్యుడు బతకలేని దుస్థితి దాపురించడం వంటివి ఏపీవైపు ఇతర రాష్ట్రాలు, దేశాల్లోని ప్రజలు జాలిగా చూసే పరిస్థితిని తెచ్చాయి. ఉత్తుత్తి బటన్‌కి ప్రజాస్వామ్య బటన్‌కి తేడా స్పష్టమయ్యే రోజు రేపే కావడంతో లోకం ఏపీవైపే చూస్తోంది.

బెట్టింగ్ బాబుల గుండెల్లో రైళ్లు

మూడు నెలల నుంచీ ఎన్నికల బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్న విషయం తెలిసిందే. వందల కోట్ల రూపాయలు బెట్టింగ్‌లు కాస్తున్నారు. వైసీపీ అభిమానులు అటువైపు, కూటమి అభిమానులు ఇటువైపు పందెం బరిలో దిగారు. కూటమిపై కోసు పందేలు కాశారు. ఇప్పుడు ఎగ్జిట్‌పోల్స్ రూపంలో ఓటరు నాడి బయటకు రావడంతో వైసీపీ తరపున పందేలు కాసిన వాళ్ల బుర్రలు వేడెక్కిపోతున్నాయి. చేతురాలా డబ్బు నాశనం చేసుకున్నామా? అనే నైరాశ్యం వారిలో తాండవిస్తోంది. దీంతో తాము పందెంలో పెట్టిన డబ్బులు ఎంతోకంత తగ్గించుకొని మిగతా సొమ్ము వెనక్కు ఇచ్చేయాలంటూ వైసీపీ తరపున పందెం కాసిన వాళ్లు అవతలి వాళ్ల కాళ్లావేళ్లా పడుతున్నారనే చర్చ నడుస్తోంది. ఓ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిపై రూ.25 లక్షలు పందెంలో పెట్టిన ఓ పెద్దాయన ఇప్పుడు పైన రూ.5 లక్షలు తగ్గించుకుని రూ.20లక్షలు తిరిగి ఇచ్చేసి పందెం రద్దు చేసుకోవాలని బతిమలాడుతున్నాడట. అవతలి వారితో మాట్లాడి సెటిల్ చేస్తే కమీషన్ కూడా ఇస్తానని చెబుతున్నాడని సమాచారం. ఇలా ఎగ్జిట్‌పోల్ ఫలితాలతో అంచనాలు తారుమారయ్యాయి. మరోవైపు 40 కంపెనీల ఎగ్జిట్‌పోల్స్‌లో 36 కంపెనీలు కూటమికే జై కొట్టడంతో వైసీపీ నాయకులు లోలోపల మరింత రగిలిపోతున్నారు. జిల్లా గుంభనంగా ఉన్నా సున్నితమైన ప్రాంతాలు ఉన్నాయి. రెచ్చగొట్టే నాయకులు ఉన్నారు. మూడు నెలల నుంచీ విధులు ఓ ఎత్తు- రేపు నిర్వర్తించబోయే విధులు మరో ఎత్తు కావడంతో పోలీసు వర్గాల్లోనూ టెన్షన్ నెలకొంది. స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలనూ మోహరించారు. కౌంటింగ్ రోజున అనవసరంగా బయట తిరగవద్దని ఎస్పీ ఇప్పటికే సూచించడం గమనార్హం.

24 గంటలే!





రేపే ప్రజాతీర్పు


కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ మాధవీలత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల నిరీక్షణకు మరికొన్ని గంటల్లో తెరపడనుంది.. ఇప్పటికే ఎగ్జిట్ పోల్ ఫలితాలతో ఒక అంచనాకు వచ్చారు.. కూటమికే జైకొట్టడంతో వైసీపీ నాయకులు డీలా పడ్డారు. ఇదిలా ఉండగా రేపే ఓట్ల లెక్కింపు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకల్లా తుది ఫలితం వెలువడనుంది. గత నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓట్లను మంగళవారం ఆదికవి నన్నయ వర్శిటీలో లెక్కించనున్నారు.ఈవీఎంలు,వీవీ ప్యాట్స్ ఇక్కడ స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. మంగళవారం ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ఆరంభిస్తారు. వీటి కోసం 17 కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో సెంటరులోనూ 14 టేబుళ్ల వంతున ఏర్పాటు చేశారు. జిల్లాలో 1577 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 98 టేబుళ్ల పరిధిలో 116 రౌండ్లలో లెక్కిస్తారు. జిల్లాలో ఈటీ పీబీ ఓటర్లు 405 మంది, పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు 15,383 మంది ఉన్నారు. జిల్లాలో మొత్తం 16,23,149 మంది ఓట ర్లు ఉండగా 13,13,645 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది 80.93 శాతం. జిల్లాలో రాజమహేంద్ర వరం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న సంగతి తెలిసిందే. వీటి పరిధిలో మొత్తం 83 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ప్రధాన పోటీ టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి, వైసీపీ మధ్యే ఉంటుంది.కాంగ్రెస్ కూడా తన బల నిరూపణ చేసుకోనుంది. ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు మొదలవుతుంది. మొదటి రెండు రౌండ్ల వరకూ ఒక్కో రౌండ్‌కు 30 నిమిషాలు పడుతుంది. తర్వాత ఒక్కో రౌండ్ 20 నిమిషాల్లోనే లెక్కింపు పూర్తవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. కేవలం 13 రౌండ్లు ఉండడం వల్ల కొవ్వూరు ఫలితం మధ్యాహ్నం 12.30 గంటల్లోపే వెలువడుతుంది. 20 రౌం డ్లు ఉన్న రాజమహేంద్రవరం రూరల్ ఫలితం మధ్యాహ్నం 2 గంటలకు చివరిగా వెలువడుతోంది. మధ్యాహ్నం 2గంటలకు మొత్తం కౌంటింగ్ ముగించాలని అంచనా వేస్తున్నారు. సాయంత్రం 6 గంటలలోపు విజే తలకు సర్టిఫికెట్లు అందజేస్తారు.

- కౌంటింగ్‌కు సర్వం సిద్ధం
- నన్నయ వర్శిటీలో ఏర్పాట్లు పూర్తి
- లోక్‌సభ, 7 అసెంబ్లీ ఫలితంపై ఉత్కంఠ
- 232 రౌండ్లలో లెక్కింపు
- ఒక్కో హాల్‌లో 14 టేబుళ్లు
- 12.30 గంటలకే తొలి ఫలితం
- 2 గంటలకు ముగిసేలా ఏర్పాట్లు
- యూనివర్శిటీ వద్ద కట్టుదిట్టమైన భద్రత
- 152 సీసీ కెమెరాలతో నిఘా
- సెక్షన్ 144, పోలీసు యాక్ట్ 30 అమలు
- రేపు ఉదయం 8 నుంచే కౌంటింగ్

17 రౌండ్లలో అనపర్తి ఓట్ల లెక్కింపు

అనపర్తి నియోజకవర్గంలో ఓట్లను 17 రౌండ్లలో లెక్కిస్తారు. మొత్తం 2,26,053 మంది ఓటర్లు ఉండగా 1,94,924 మంది ఓటేశారు.ఇది 86.23 శాతం. ఇక్కడ మొత్తం 228 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో రౌండ్‌లోనూ 14 టేబుళ్లలో 14 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కిస్తారు. నన్నయ వర్శిటీ ఎన్.బ్లాక్ 215,216 రూమ్‌లలో పార్లమెంట్ అభ్యర్థులకు పోలైన ఓట్లు, అసెంబ్లీ అభ్యర్థులు ఓట్లను 218, 218ఎ హాళ్లలోనూ లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్‌లు లెక్కించడానికి 2 టేబుళ్లు ఏర్పాటు చేశారు.

రాజానగరంలో 16 రౌండ్లు

రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 216 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 2,16,491 మంది ఓటర్లు ఉండగా 1,89,505 ఓటేశారు.ఇది 87.53 శాతం. 16 రౌండ్లలో లెక్కిస్తారు.నన్నయ వర్శిటీ ఇంజనీరింగ్ వర్క్‌షాప్ భవనంలో లెక్కిస్తారు.పోస్టల్ బ్యాలెట్ ఓట్లను 4 టేబుళ్ల పరిధిలో మొదటి అంతస్తులోనే లెక్కిస్తారు.

భారీ భద్రత ఏర్పాట్లు

నన్నయ్య విశ్వవిద్యాలయంలో కౌంటింగ్ సెంటర్ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. యూనివర్సిటీ ఆవరణ నుంచి కిలోమీటరు పరిధిలో 144 సెక్షన్ అములులో ఉంటుంది. పోలీసు యాక్ట్ 30 కూడా అమలులో ఉంటుంది.ఒక కంపెనీ కేంద్ర ఆర్మ్‌డ్ బలగాలు,ఒక ప్లాటూన్ ఏపీఎస్పీ బలగాలు, ఇద్దరు అద నపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు,9 మంది సీఐలు, 16 మంది ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు,30 మంది ఏఆర్ఎస్ఐలు, 25 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 63 మంది హోంగార్డులు, 128 మంది పోలీసు కానిస్టేబుళ్లను నియమించినట్టు ఎస్పీ తెలిపారు.

రాజమండ్రి సిటీలో 17 రౌండ్లు

రాజమండ్రి సిటీ పరిధిలో 237 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 2,67,484 ఓటర్లు ఉండగా 1,80,733 మంది ఓటేశారు. ఇది 67.57 శాతం. వీటిని 17 రౌండ్లలో లెక్కిస్తారు.నన్నయ వర్శిటీ ఎన్ బ్లాక్ ఈస్ట్ వింగ్‌లో లెక్కిస్తారు.319వ హాల్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారు.

రాజమండ్రి రూరల్‌లో 20 రౌండ్లు

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో 267 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 2,72,826 మంది ఓటర్లు ఉండగా 1,99,220 మంది ఓటేశారు. ఇది 73.02 శాతం. 20 రౌండ్లలో లెక్కిస్తారు. నన్నయ వర్శిటీ ఎన్ బ్లాక్‌లో ఓట్లను లెక్కిస్తారు. 113వ రూమ్‌లో 5 టేబుళ్లలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. జిల్లాలో చివరగా ఈ ఫలితమే వెలువడుతుంది.

కొవ్వూరులో 13 రౌండ్లు

కొవ్వూరు నియోజకవర్గంలో 176 పోలింగ్ కేం ద్రాలు ఉన్నాయి.మొత్తం 1,84,136 ఓటర్లు ఉండగా 1,58,176 మంది ఓటేశారు.ఇది 85.90 శాతం. 13 రౌం డ్లలో లెక్కిస్తారు.నన్నయ వర్శిటీ ఎన్‌బ్లాక్ రెండో అం తస్తులో ఓట్లు లెక్కిస్తారు.పోస్టల్ బ్యాలెట్ ఓట్లను 4 టేబుళ్లలో లెక్కిస్తారు.జిల్లాలో మొదటగా వెలువడే ఫలితమిదే.

నిడదవోలులో 15 రౌండ్లు

నిడదవోలు నియోజకవర్గంలో 205 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 2,13,396 మంది ఓటర్లు ఉండగా 1,80,688 మంది ఓటేశారు. ఇది 84.67 శాతం. 15 రౌండ్లలో లెక్కిస్తారు.నన్నయ వర్శిటీ ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్ దిగువ అంతస్తులో లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను మూడే టేబుళ్లలో లెక్కిస్తారు.

గోపాలపురంలో 18 రౌండ్లు

గోపాలపురం నియోజకవర్గంలో 248 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 2,42,763 మంది ఓటర్లు ఉండగా 2,10,399 మంది ఓటేశారు. ఇది 86.67 శాతం. ఈ ఓట్లను 18 రౌండ్లలో లెక్కిస్తారు.నన్నయ వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్ మొదటి అంతస్తులోని ఉత్తరం వైపు కాన్ఫరెన్స్ హాల్‌లో ఓట్లు లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను 2 టేబుళ్లలో లెక్కిస్తారు.

విజేతలెవరో..

ఒక్కరోజులోనే విజేతలెవరో..పరాజితులెవరో తేలిపోనుంది. జిల్లాలో రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు, అనపర్తి, రాజానగరం,రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న సంగతి తెలిసిందే.వీటి పరిధిలో మొత్తం 83 మంది పోటీ చేశారు. అసెంబ్లీల నుంచి మొత్తం 71 మంది పోటీ చేశారు. వారిలో ఏకంగా 59 మంది స్వతంత్ర అభ్యర్థులు. రాజమండ్రి లోక్‌సభ నుంచి టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి తరపున బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఆమెకే గెలుపు అవకాశాలు ఉన్నాయని అంచనా.ఆమెకు పోటీగా వైసీపీ నుంచి డా.గూడూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఈ పార్లమెంట్ స్థానం నుంచి మొత్తం 12 మంది పోటీపడ్డారు. కూటమి తరపున ఆదిరెడ్డి వాసు (రాజమండ్రిసిటీ),గోరంట్ల బుచ్చయ్యచౌదరి (రాజమండ్రి రూరల్),బత్తుల బలరామకృష్ణ (రాజానగరం), నల్లమిల్లి రామకృష్ణారెడ్డి(అనపర్తి), ముప్పిడి వేంకటేశ్వరరావు(కొవ్వూరు), కందుల దుర్గేష్(నిడదవోలు), మద్దిపాటి వెంకట్రాజు(గోపాలపురం) నుంచి పోటీ చేశారు.వీరిలో కందుల దుర్గేష్, బత్తుల బలరామకృష్ణ జనసేన, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బీజేపీ తరపున కూటమి అభ్యర్థులుగా పోటీ చేశారు. వైసీపీ నుంచి మార్గాని భరత్ రామ్(రాజమండ్రి సిటీ), చెల్లుబోయిన వేణు(రాజమండ్రి రూరల్), జక్కంపూడి రాజా(రాజానగరం),సత్తి సూర్యనారాయణరెడ్డి (అనపర్తి), తలారి వెంకట్రావు(కొవ్వూరు),జి.శ్రీనివాసనాయుడు (నిడదవోలు),తానేటివనిత(గోపాలపురం) నుంచి పోటీ చేశారు.


నన్నయ వర్శిటీ గేటు ముందు బారికేడ్లు

సమన్వయంతో పనిచేయండి : మాధవీలత

దివాన్‌చెరువు, జూన్ 2 : లెక్కింపు సిబ్బంది విధులు నిర్వహణలో చక్కటి పనితీరు కనబరచాలని, సమన్వయం చేసుకోవడం కీలకమని జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన లెక్కింపు సిబ్బంది క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మంగళవారం లెక్కింపు విధుల్లో పాల్గొనే అధికారులను, సిబ్బందిని తొలి ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేశామన్నారు. ఎన్నికల పరిశీలకుల సమక్షంలో రెండో ర్యాండమైజేషన్ చేసి నియోజకవర్గాలవారీగా కేటాయించినట్టు తెలిపారు.లెక్కింపు రోజున ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలైన ఓట్లు లెక్కింపుపై అవగాహన కల్పించామన్నారు. వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకునే క్రమంలో లెక్కింపు ప్రక్రియపై ఆదివారం శిక్షణ ఇచ్చామన్నారు. ఓట్లు లెక్కింపు జరిగే నాలుగో తేదీ ఉదయం 5 గంటల తదుపరి నియోజకవర్గంలో నిర్దేశించిన లెక్కింపు టేబుళ్లకి అధికారులు, సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా బృందాలుగా సాంకేతికపరమైన విధానంలో ఎంపిక చేస్తామన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు అందుబాటులో రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి ఉంటారన్నారు.పార్లమెంటు పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపునకు నన్నయ వర్శిటీ పరిపాలనా భవనంలో 15 టేబుల్స్ ఏర్పాటు చేశామని తెలిపా రు.కార్యక్రమంలో డీఆర్వో జి.నరసింహులు, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.కృష్ణనాయక్,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు సిద్ధమా..?
రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2 : కౌంటింగ్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. నన్నయ వర్శిటీలో ఈనెల 4న నిర్వహించే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లపై ఆదివారం వెలగపూడి సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత పాల్గొ న్నారు.కౌంటింగ్ ప్రక్రియకు చేసిన ఏర్పాట్లను వివరించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబందించి ఏర్పాట్లు చేశామని తెలిపారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత చేపట్టాల్సిన కార్యకలాపాలపై అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.సజావుగా కౌంటింగ్ చేపట్టేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

రాజమహేంద్రవరం చేరుకున్న పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 2 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, కూటమి ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం రాజమహేంద్రవరంలోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ నెల 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పురందేశ్వరి రాజమహేంద్రవరం వచ్చిన వెంటనే కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే ముఖ్యమైన ఏజెంట్లు, పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఓట్ల లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పురందేశ్వరిని పలువురు బీజేపీ, తెలుగుదేశం, కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనపర్తి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మండపేట తెలుగుదేశం అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు పురందేశ్వరిని కలిశారు.

టోల్ బాదుడు

- ఎన్నికల ముగింపు..వెంటనే పెంపు
- ఏప్రిల్ ఒకటి నుంచే పెంచాలి
- అడ్డంకిగా మారిన ఎన్నికలు
- హడావుడిగా ఆదివారం ఉత్తర్వులు
- ఐదు శాతమే పెంచినట్టు వెల్లడి
- 10 నుంచి 20శాతం పెంపు
- వాహనదారుల లబోదిబో



గొల్లప్రోలు, జూన్ 2: ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే వాహనదారులకు భారీ షాక్ తగిలింది. టోల్ బాదుడు మొదలైంది. ఆదివారం అర్ధరాత్రి దాటిన దగ్గర నుంచి దేశవ్యాప్తంగా ఉన్న టోల్‌ప్లాజాల్లో చార్జీలను పెంచుతూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఐదు శాతమే పెంచామని నేషనల్ హైవే అథారిటీ చెబుతున్నా అంతకంటే అధికంగా చార్జీలను పెంచారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ,అసెంబ్లీల ఎన్నికల పోలింగ్ ముగియడంతో ప్రజలపై భారం మోపేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వలేదంటూ సాకులు చెబుతూ పోలింగ్ ముగిసిన వెంటనే భారం మోపడంపై వాహనదారులు మండిపడుతున్నారు.ఐదు శాతమే పెంచుతున్నామని అధికారులు చెబుతున్నా వాస్తవంగా కొన్ని కేటగిరీ వాహనాలకు 10 నుంచి 20 శాతం వరకూ చార్జీలను పెంచేశారు.

గామన్ బ్రిడ్జిపై టోల్‌గేట్..

కాకినాడ జిల్లాలో 216వ జాతీయ రహదారిపై పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల గొల్లప్రోలు టోల్‌ప్లాజా, తుని-రాజమహేంద్రవరం మధ్య గల 16వ నెంబరు జాతీయ రహదారిపై గల కృష్ణవరం, కొవ్వూరు - రాజమహేంద్రవరం గామన్ బ్రిడ్జిపై టోల్‌ప్లాజా వద్ద వసూలు చేసే చార్జీలను పెంచారు. పెంచిన చార్జీలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చాయి. సాధారణంగా ప్రతి ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ ఒకటో తేదీన దేశవ్యాప్తంగా టోల్‌గేట్లు వద్ద వసూలు చేసే చార్జీలను సవరిస్తూ ఉంటారు. ఈ పర్యాయం అప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడం, ఏడు విడతల పోలింగ్ ముందు ఉన్న నేపథ్యంలో చార్జీలు పెంచాలన్న నేషనల్ హైవే అథారిటీ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. అయితే చార్జీల పెంపునకు ఎన్నికల కమిషన్ అంగీకరించలేదంటూ అప్పట్లో చెప్పుకొచ్చారు.ఎన్నికల చివరి దశ పోలింగ్ జూన్ ఒకటో తేదీన ముగియడంతోనే మరలా టోల్ చార్జీల పెంపు నిర్ణయాన్ని తెరపైకి తెచ్చారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి టోల్ చార్జీలను పెంచాలని నేషనల్ హైవే అథారిటీ నిర్ణయించింది.ఆ మేరకు ఆదేశాలు జారీ చేయడంతో పెరిగిన చార్జీలు అమల్లోకి వచ్చాయి.

ఆదివారం నుంచే వసూళ్లు..

గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద వాహనదారులు నుంచి ఆదివారం అర్ధరాత్రి నుంచి పెరిగిన చార్జీలను వసూలు చేయడం ప్రారంభించారు. కారు, జీపు, వ్యాన్, ఇతర తేలికపాటి వాహనాలకు ఇప్పటి వరకూ ఒకవైపు టోల్ చార్జీలు రూ.45 ఉండగా ఆ చార్జీలను రూ.50లకు పెంచారు. 24 గంటల్లోపు తిరిగి వస్తే రెండు వైపులా చార్జీ రూ.75లకు పెరిగింది. తేలికపాటి వ్యాపార వాహనాలు, మినీబస్సులు ఒకవైపు చార్జీ రూ.75 ఉండగా రూ.80కి పెంచారు. రెండు వైపులా చార్జీని రూ.115 నుంచి 120కి, మూడు యాక్సిల్స్ ఉన్న కమర్షియల్ వాహనాల ఒకవైపు టోల్‌చార్జీలు రూ.175 నుంచి 185, రెండు వైపులా చార్జి రూ.260 నుంచి రూ.280లకు, బస్సు లేదా ట్రక్‌కు రూ.160 నుంచి 170కి, రెండు వైపులా చార్జీని రూ.240 నుంచి రూ.255కి పెంచారు. భారీ నిర్మాణ మెషినరీ, మల్టీ యాక్సిల్ (4లేదా 6) వాహనాలకు ఒక వైపు చార్జీ రూ.250 నుంచి రూ.270, రెండు వైపులా చార్జీని రూ.375 నుంచి రూ.400, ఏడు లేదా అంతకంటే పెద్ద యాక్సిల్స్ కలిగిన వాహనాలకు ఒకవైపు టోల్ చార్జీలు రూ.265 నుంచి ఏకంగా రూ.325కి పెంచారు. రెండు వైపులా చార్జీని రూ.455 నుంచి రూ.490కి పెంచారు. లోకల్ వాహనాలకు నెలవారీ పాస్ చార్జీలను రూ.300 నుంచి రూ.340కి పెంచారు. 16వ జాతీయరహదారిపై గల కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద ఇదే రీతిలో చార్జీలు పెరిగాయి. రాజమహేంద్రవరం-కొవ్వూరు గామన్ బ్రిడ్జిపై టోల్ చార్జీలు ఈ నిష్పత్తిలోనే పెరిగినట్టు సమాచారం. ఒకే సారి భారీగా చార్జీలు పెంచడంతో వాహనదారులు షాక్‌కు గురయ్యారు. విషయం తెలియని వాహనదారులు తమ వద్ద ఎందుకు అధికంగా టోల్ చార్జీలు కట్ చేశారంటూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల ముందు టోల్‌చార్జీలను పెంచితే వ్యతిరేకత వస్తుందనే కేంద్ర ప్రభుత్వం పెంచకుండా పోలింగ్ ముగియగానే పెంచిందని వాహనదారులు మండిపడుతున్నారు.



వేటుపడిన డీఎస్పీ రామారావు | కొత్తగా నియమితులైన శ్రీనివాసమూర్తి

కొవ్వూరు డీఎస్పీపై వేటు

- ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యమే కారణం
- క్రైమ్ డీఎస్పీ శ్రీనివాసమూర్తికి బాధ్యతలు

రాజమహేంద్ర వరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించిన పోలీస్ అధికారిపై వేటు పడింది. కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు విధుల్లో అలసత్వం వహించడం, కింది సిబ్బందిని వేధించడం, అక్రమార్కులతో చేతులు కలపడంపై 'పోలీస్ దందా' పేరుతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడిన విషయం తెలిసిందే. ఈ కథనం పోలీసు వర్గాల్లో సంచలనం రేపింది. ఉన్నతాధికారులు తక్షణమే రంగంలోకి దిగారు. వేగంగా దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు.సాయంత్రానికి రామారావును విధుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. విజయవాడలోని డీజీపీ కార్యాల యంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. కొత్త డీఎస్పీ(ఇన్‌చార్జి ఎస్ డీపీవో)గా జిల్లాలోని క్రైం డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న కె.శ్రీనివాసమూర్తిని నియమించారు.ఆయన ఆదివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. రామారావు గుంటూరు నుంచి ఎన్నికల కోటాలో బదిలీపై ఈ ఫిబ్రవరిలో జిల్లాకు వచ్చారు. రామారావు బదిలీపై సబ్-డివిజన్‌లోని బాధిత సిబ్బంది ఆనందం వ్యక్తం చేయడం గమనార్హం.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రావెల్ బస్సు

● ఆర్టీసీ బస్సు డ్రైవరుతో పాటు మరో 29 మందికి గాయాలు


ఆర్టీసీ బస్సును ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న దృశ్యం


క్షతగాత్రులను అంబులెన్సులో తరలిస్తున్న 108 సిబ్బంది


ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్న క్షతగాత్రులు

ముమ్మిడివరం, జూన్ 2: ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న సంఘటనలో 29 మంది గాయపడ్డారు. ఈ సంఘటన 216 జాతీయ రహదారి ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం జరిగింది. కాకినాడ నుంచి ప్రయాణికులతో వస్తున్న అమలాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న బొలేరో వ్యాన్‌ను తప్పించబోయి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవరుతో పాటు, మరో 25 మంది గాయపడ్డారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో డ్రైవరుతో పాటు ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆర్టీసీ బస్సులో 70 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. కాకినాడ నుంచి అమలాపురం వెళుతున్న మరో ఆర్టీసీ బస్సు కోరంగి వద్ద ఆగిపోవడంతో ఆ బస్సులో ఉన్న ప్రయాణికులను కూడా ప్రమాదానికి గురైన బస్సులోకి ఎక్కించడంతో బస్సులో 70 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. హైదరాబాద్ నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆర్టీసీ బస్సులో గాయపడిన డ్రైవరుతో పాటు 25 మంది ప్రయాణికులను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వారిలో 12 మంది క్షతగాత్రులను అంబులెన్సులో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



వారిలో అంబాజీపేటకు చెందిన డి.రామసీత, కాకినాడకు చెందిన జి.శ్రీనివాస్, భీమవరానికి చెందిన డి.జాన్‌బాబు, గుత్తెనదీవికి చెందిన సీహెచ్ కృష్ణవేణి, అమలాపురానికి చెందిన కె.సాయివేణి, అయినాపురానికి చెందిన ఎన్.కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రైవేటు ట్రావెల్స్‌లో గాయపడిన డ్రైవరు, ఇద్దరు ప్రయాణికులను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్‌ఐ బి.సురేష్‌బాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దు

● స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ రవిప్రకాష్
● లెక్కింపు ప్రాంతంలో మూడంచెల భద్రత: తూర్పు ఎస్పీ


ఓట్ల లెక్కింపు భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ రవిప్రకాష్

దివాన్‌చెరువు/రాజమహేంద్రవరం, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సెక్షన్ సీఆర్‌పీసీ, సెక్షన్ పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరూ ఉద్వేగపూర్వక, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్, ఓట్ల లెక్కింపు నిమిత్తం ఏలూరు రేంజ్‌కు ప్రత్యేకాధికారిగా నియమితులైన ఎం.రవిప్రకాష్ హెచ్చరించారు. ఆదికవి నన్నయ విద్యాలయాన్ని ఆదివారం ఎస్పీ పి.జగదీష్‌తో కలసి ఆయన ఆదివారం సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, బందోబస్తు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం రవిప్రకాష్ మాట్లాడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించకూడదన్నారు. అన్ని రాజకీయపార్టీల నాయకులు తమ కేడరు ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా చూసుకోవాలన్నారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ ట్రయల్ రన్ ఆదివారం నిర్వహించామన్నారు. లెక్కింపు జరిగే ప్రాంతంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. లెక్కింపు కేంద్రం ఆవరణలో 152 సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి కంట్రోల్ రూమ్ సిబ్బంది ద్వారా వాటిని మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. లెక్కింపు సిబ్బంది, ఏజెంట్లు, జనరల్ ఏజెంట్లు, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తామన్నారు. దీనికోసం 40 డీఎఫ్ఎండీఎస్, శిక్షణ పొందిన సిబ్బందిని నియమించామన్నారు. మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. లెక్కింపు సిబ్బందికి, ఏజెంట్లకు పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ ద్వారా సూచనలిస్తామన్నారు. అత్యవసర ఏర్పాట్లలో భాగంగా అక్రమంగా గుమిగూడిన వారిని చెదరగొట్టడానికి వజ్రవాహనం, టియర్ గ్యాస్ ఎక్విప్‌మెంట్, అంబులెన్స్, ఫైరింజన్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చెప్పారు. లెక్కింపు అనంతరం అవాంఛనీయ సంఘటనలను నిరోధించే క్రమంలో 129 సమస్యాత్మక గ్రామాలను, ప్రాంతాలను గుర్తించి ఆ ప్రదేశాల్లో 39 పోలీస్ పికెట్‌లు, 59 మొబైల్ పార్టీలను, 13 క్యూఆర్టీ బృందాలను నియమించామన్నారు. అభ్యర్థుల ఇళ్ల వద్ద, పార్టీ కార్యాలయాలవద్ద పికెట్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు జిల్లా ప్రజలు, మీడియా మిత్రులు పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

పవన్ మెజార్టీపై జాతీయస్థాయిలో ఉత్కంఠ

● ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి
● జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు


ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

పిఠాపురం, జూన్ 2: ఎన్నికల ప్రక్రియలో చివరి అంకమైన కౌంటింగ్‌లో ఏజెంట్ల పాత్ర కీలకమని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం శివారు గోకులం గ్రాండ్‌లో ఆదివారం సాయంత్రం కౌంటింగ్ ఏజెంట్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సాధించబోయే మెజార్టీపై జాతీయస్థాయిలో ఉత్కంఠ ఉందని చెప్పారు. ఏ ఒక్క ఓటు కూడా లెక్క తప్పకుండా చూసుకోవాల్సిన బాధ్యత కౌంటింగ్ ఏజెంట్లపై ఉందని తెలిపారు. తాజాగా వెలువడిన ఎగ్జిట్‌పోల్స్ కూటమికి ప్రోత్సాహకరంగా ఉన్నాయని చెప్పారు. భీమవరంలో కౌంటింగ్ సమయంలో జరిగిన పొరపాట్లు కారణంగా నష్టపోయామని గుర్తుచేస్తే అటువంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఎప్పటికప్పుడు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ సందేహాలు కలిగితే వెంటనే ఆర్వోకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమావేశంలో జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, మర్రెడి శ్రీనివాస్, యాతం నగేష్, సందీప్ పాల్గొన్నారు.

కృష్ణబాబుకు ఘన నివాళి


మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు


కృష్ణబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూన్ 2: కొవ్వూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పారిశ్రామికవేత్త పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) మృతికి పలువురు నేతలు సంతాపం తెలిపారు. ఆదివారం కొవ్వూరు మండలం దొమ్మేరులో జరిగిన కృష్ణబాబు దశ దిన కార్యక్రమానికి పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు విచ్చేసి కృష్ణబాబు సోదరుడు ది ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ ఛైర్మన్ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)తో పాటు కృష్ణబాబు అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, రాజమహేంద్రవరం పార్లమెంటు కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, నరసాపురం ఎంపీ కనుమూరు రఘురామకృష్ణంరాజు, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు, సినీ నిర్మాత కేఎల్ నారాయణ, కొవ్వూరు, గోపాలపురం కూటమి అభ్యర్థులు ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మాజీ మంత్రులు సీహెచ్ అయ్యన్నపాత్రుడు, కామినేని శ్రీనివాస్, కావూరి సాంబశివరావు, దొడ్డికర్ల సువర్ణరాజు, మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరామ్, టీవీ రామారావు, అవినాష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొర్రెల శ్రీధర్, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, ఇమ్మణి వీరశంకరం, కేవీకే రంగారావు పాల్గొని కృష్ణబాబుకు నివాళులర్పించారు.

విషపురుగు కాటుకు మహిళ మృతి



సామర్లకోట, జూన్ 2: కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ పరిధి కొత్తపేట భీమవరం ప్రాంతానికి చెందిన తాతపూడి మేరీ(44) ఆదివారం తెల్లవారుజామున విషపురుగు కాటుకు గురైంది. దీంతో కుటుంబసభ్యులు మేరీని సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స ప్రారంభించగా చికిత్స పొందుతూ మేరీ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సామర్లకోట పోలీసులు తెలిపారు.

మారేడుమిల్లిలో 378 టేకు చెట్ల కథ కంచికేనా ?

● సరుకు దొరికేసింది, స్మగ్లింగ్ జరగలేదంటున్న అటవీ అధికారులు
● ఆదివాసీల పోడు వ్యవసాయం నేరమైతే, టేకు చెట్ల నరికివేత నేరం కాదా? ● ఇప్పటికే మారేడుమిల్లి భాగోతంపై ప్రభుత్వంవద్ద నివేదిక పెండింగ్
● అనుకూల ప్రభుత్వమే వస్తుందన్న ఆశలో అక్రమార్కులు


టేకు ప్లాంటేషన్‌లో విచారణ జరుపుతున్న అధికారులు (ఫైల్)

(రంపచోడవరం)

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైన మారేడుమిల్లి అటవీ ప్లాంటేషన్లలో అక్రమ నరికివేతకు గురైన 378 టేకు చెట్ల కథ కంచికి పోయినట్టే అన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రక్షిత అటవీ ప్రాంతంలోని టేకు ప్లాంటేషన నుంచి పెద్దఎత్తున చెట్ల నరికివేత, గల్లంతు భాగోతాలు వెలుగుచూసిన వెంటనే అటవీ శాఖకు చెందిన రాష్ట్ర ముఖ్య అధికారి ఆదేశాలతో సమగ్ర విచారణ ప్రారంభమైంది. రాజమండ్రి సీసీఎఫ్ పర్యవేక్షణలో ఇతర ప్రాంతాల డీఎఫ్‌వోలు, పలువురు సీనియర్ అధికారులతోపాటు విజిలెన్సు విభాగం కూడా విచారణ సాగించి నిగ్గు తేల్చింది. తొలుత 300 చెట్ల నరికివేతను గుర్తించగా, తర్వాత జరిగిన పలు విచారణలతో నరికివేసిన చెట్ల సంఖ్య 378కి చేరింది. ఈ నరికివేత వెనుక అటవీ శాఖ ఇంటిదొంగల పాత్రే కీలకంగా ఉందన్న సంగతి అందరికీ తెలిసిందే! ఇందులో దొంగలను పట్టే పనికంటే నరికివేతకు గురైన చెట్లకు సరిపడ సరుకును గుర్తించి, దానిని రాబట్టి ప్రభుత్వానికి నష్టం చేకూరలేదన్న వాదనను వినిపించేందుకే అధికారులు అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

అటవీ చట్టం కింద కానీ, అటవీ సంరక్షణ చట్టం కింద కానీ అటవీ ప్రాంతంలో పర్యావరణ హితం కానీ ఏ వినాశనం జరిగినా అది నేరమే! రక్షిత అటవీ ప్రాంతం గుండా రెండు హెక్టార్లకు మించి కనీసం రహదారి కోసం కూడా అనుమతించవద్దని చట్టం చెబుతోంది. ఈ కారణంతోనే ఆదివాసీల సాంప్రదాయ పోడు వ్యవసాయాన్ని కూడా అటవీ అధికారులు నేరంగా పరిగణిస్తున్నారు. వందలాదిగా ఆదివాసీలు గత కొన్నేళ్లుగా పోడు వ్యవసాయం నేరం కింద నిందితులయ్యారు.. కానీ రక్షిత అటవీ ప్రాంతంలో టేకు ప్లాంటేషన్లలో వందలాదిగా చెట్లు నరికివేతకు గురైతే మాత్రం అది నేరం కాదన్న సంకేతాన్ని మారేడుమిల్లి టేకుచెట్ల భాగోతం ద్వారా అధికారులు ఇచ్చారు. బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సును ఉపయోగించి ఇంటిదొంగలను సైతం పట్టాలని అటవీశాఖ రాజమహేంద్ర వరం సీసీఎఫ్ ఇచ్చిన ఉత్తర్వులనే ఇక్కడి అధికారులు ఖాతరు చేయని దుస్థితి.

ఇదిలావుండగా ఈ మొత్తం భాగోతంపై పలు నివేదికల ఆధారంగా రాష్ట్ర అటవీశాఖ ముఖ్య అధికారి ద్వారా ప్రభుత్వానికి సమగ్రంగా నివేదిక చేరినట్టు సమాచారం. ఎన్నికల కోడ్ కారణంగానే ఈ భాగోతం వెనుక ఉన్న అధికారులపై చర్యలు తీసుకోలేని పరిస్థితి నెలకొందని సమాచారం. ఇందులో కొందరి అధికారుల గత చరిత్ర నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను నివేదించి తదుపరి నిర్ణయాన్ని ప్రభుత్వానికే వదిలేశారు. ఈ జాప్యాన్ని అనుకూలంగా మార్చుకునే పనిలో పడిన అధికారులు మాత్రం తమకు అనుకూలమైన ప్రభుత్వమే వస్తుందని, క్రింది అధికారులపై చర్యలతోనే ఇది ముగిసి పోతుందన్న ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.

నెల కిందటే హత్య చేసి..పూడ్చిపెట్టి

● ఒమ్మంగి యువకుడి దారుణహత్య.. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు
● పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో మృతదేహం వెలికితీత


హత్యకు గురైన మొగలి సతీష్ (ఫైల్)

ప్రత్తిపాడు, జూన్ 2: కాకినాడ జిల్లాప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన మొగలి సతీష్(33)దారుణ హత్యకు గురయ్యాడు. దుండగులు సతీష్‌ను హతమార్చి ఉత్తరకంచి పొలాల్లో గుట్టుచప్పుడు కాకుండా పూడ్చివేశారు. దీనిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆదివారం ఉత్తరకంచిలోని ఘటనా ప్రదేశంలో మృతదేహాన్ని వెలికితీశారు. సంచలనంగా మారిన ఈ ఘటనపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన మొగలి సతీష్(33)కు పదేళ్లక్రితం ఒమ్మంగికి చెందిన మహిళతో వివాహమైంది. సతీష్ సింహాద్రిపురం నుంచి ఒమ్మంగి వచ్చి భార్యతో కలిసి ఉంటు న్నాడు. ఈ క్రమంలో మే 4న తన భర్త మొగలి సతీష్ అదృశ్యమయ్యాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు గత 29 రోజులుగా ము మ్మర దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు లోతుగా దర్యాప్తుచేసి సతీష్ హత్యకు గురైనట్లు కొనుగొన్నారు. మండలంలోని ఉత్తరకంచి, పొదురుపాక గ్రామాల మధ్య పంట పొలంలో హత్య చేసి పూడ్చివేసిన ప్రదేశాన్ని ఆదివారం ప్రత్తిపాడు తహసీల్దార్ నరసింహరావు, సీఐ శేఖర్‌బాబు, ఎస్‌ఐ పవన్‌కుమార్, పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని నెలరోజుల క్రితం పూడ్చివేసిన మృతదేహాన్ని వెలికితీసి శవపంచనామా నిర్వహించారు. సతీష్‌ను ఎందుకు హతమార్చారు అనే దానిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వివాహేతర సంబంధంవల్ల జరిగిందా? లేదా పాత కక్షల నేపథ్యంలో సతీష్‌ను హతమార్చారా అనేది తెలియాల్సి ఉంది. సతీష్‌ను హతమార్చిన ఘటనలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏ ప్రభుత్వమొచ్చినా ఏముంది?

● రాష్ట్ర విభజనకు పదేళ్లు
● మన ఆస్తిని తెచ్చుకోలేని అసమర్థులం
● పోలవరం వదిలేశారు
● ప్రతిపక్షం ఉంటేనే ప్రజాస్వామ్యం
● మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్



రాజమహేంద్రవరం, జూన్2(ఆంధ్రజ్యోతి) : ఏప్రభుత్వం వచ్చినా ఇంతే. ఏముంది గర్వకారణం. రాష్ట్ర విభజన జరిగి ఆదివారం నాటికి పదేళ్లు పూర్త యింది. మనం మన ఆస్తిని కూడా తెచ్చుకోలేని అసమ ర్థులుగా ఉండిపో తున్నాం. ఇక ప్రభుత్వాలు ఎందుకు? అసలు ప్రొసీజర్‌ను పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ వ్యాఖ్యానించారు. రాజమ హేంద్రవరం ధర్మంచర హాల్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మా ట్లాడారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రతిపక్షం కూడా బలంగా ఉండాలి. అప్పుడే ప్రజాస్వామ్యం ఉంటుందన్నారు. తెలంగాణ ప్రజలు ఆవిర్భావ దినోత్సవ ఉత్సాహంతో ఉంటే, మనం దశాబ్ది గోసతో బాధపడుతు న్నామన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని వాటితో పాటు రాష్ట్రానికి రావలసిన వాటాను కోటా పొందడంలో ప్రస్తుతం విఫలమయ్యా మన్నారు. 2014-15లో కేంద్ర ప్రభుత్వం 32,625 కోట్ల ఆర్థిక లోటును భర్తీ చేయవలసి ఉంది. కానీ 5,615 కోట్లే వచ్చింది. పోలవరం ప్రాజెక్టు 48 శాతం మాత్రమే పూర్తయింది. ఇది రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. ఇక కేవలం 521 కోట్లు మాత్రమే పోలవరానికి బాకీ ఉన్నట్టు కేంద్రం స్పష్టం చేసిందని వివరించారు. ఇక వెనుకబ డిన ప్రాంతాలు, వివిధ ప్రాజెక్టుల కింద ఏడేళ్లలో 1500 కోట్లు ఇచ్చారు. కానీ ఇంకా 3,520 కోట్లు రావలసి ఉంది. దీనికి కారణం రాష్ట్రంలో కేంద్రం మీద ఒత్తిడి చేసే ప్రభుత్వమే లేదన్నారు. తెలంగాణ నుంచి ఏపీకి లక్షా 28 వేల కోట్ల విలువైన ఆస్తులు రావాలి. సుమారు లక్షా 60 వేల మంది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏ రాష్ట్రం ఇవ్వాలో అర్థంకాని పరిస్థితిలో వారు నష్టపోయారని తెలిపారు. తెలంగా ణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి ఇవి సాధించుకోవడానికి సరైన సమయం అని అన్నారు.

తలుపులమ్మా.. శరణు

● భక్తజన సందోహంగా లోవ క్షేత్రం
● ఒక్కరోజే రూ.5.07 లక్షల ఆదాయం


ఆరుబయట వంటావార్పు చేసుకుంటున్న భక్తులు

తునిరూరల్, జూన్ 2: తలుపులమ్మ లోవ క్షేత్రం ఆదివారం భక్తజనసందోహంగా మారింది. ఆలయానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని కనులారా తిలకించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన లోవ భక్తులు ఆలయప్రాంగణం మామిడితోటల్లో, ఆలయ వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు సౌకర్యార్థం ఆలయ అధికారులుప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లోవ కూడలిలో రద్దీగా మారిన వాహన ట్రాఫిక్‌ను రూరల్ పోలీసులు నియంత్రించి వాహన రాకపోకలు చక్కబెట్టారు. ఆదివారం ఒక్కరోజు లోవకు తరలివచ్చిన భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.5.07లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాధరాజు తెలిపారు

దగ్గుబాటి దంపతులను కలిసిన నల్లమిల్లి, వేగుళ్ల


రాజమహేంద్రవరంలో దగ్గుబాటి దంపతులను సత్కరిస్తున్న ఎన్డీయే కూటమి అనపర్తి, మండపేట అభ్యర్థులు నల్లమిల్లి, వేగుళ్ల

అనపర్తి, జూన్ 2: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులను అనపర్తి, మండపేట కూటమి అభ్యర్థులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం రాజమహేంద్రవరంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంగళవారం జరుగనున్న కౌం టింగ్ సందర్భంగా వీరు దగ్గుబాటి దంపతులతో చర్చించారు. ఆపై వారిని సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా పురందేశ్వరి, అనపర్తి అసెంబ్లీ అభ్యర్థిగా తన విజయం తథ్యమని, రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా, కేంద్రంలో నరేంద్రమోదీ మూడోసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపడతారని అన్నారు.

తగ్గుతున్న కర్ర పెండలం సాగు

● పామాయిల్ తోటల సాగుకు పయనం
● 5 వేల ఎకరాలకు మాత్రమే పరిమితమయ్యే ప్రమాదం


నాణ్యమైన దుంపవిత్తనం కర్రను సేకరిస్తున్న రైతులు

సామర్లకోట, జూన్ 2 : రాష్ట్రంలో కర్ర పెండలం దుంపసాగు చేసే ఏకైక జిల్లాగా ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా జాతీయస్థాయిలో పేర్గాంచగా ఆ పంట దిగుబడులకు డిమాండ్ లేకపోవడం, సాగు వ్యయం ఏడాదికేడాది పెరిగిపోవడంతో పలువురు రైతులు కర్ర పెండలం సాగు చేసేందుకు అంతగా ఆశక్తి కనబర్చడంలేదు. ప్రతీఏటా జూన్ నెల మొదటి వారంలో వర్షాలు కురిసినా, కురవకపోయినా దుంప ముచ్చు కర్రలను విత్తనం నారుమడులుగా దుంప రైతులు సన్నద్ధం చేసేవారు. ఈ వారంలో రెండు దఫాలు భారీ వర్షాలు కురిసినా భూములను దుంపసాగుకు సన్నద్ధం చేసేందుకు అంతగా ఆశక్తి కనబర్చకపోవడం అత్యంత విచారకరం. మూడేళ్ల క్రితం వరకూ జిల్లాలో సుమారు 50వేల ఎకరాల వరకూ కర్ర పెండలం దుంప పంట సాగయ్యేది. ఈ ఏడాది జూలై నెలాఖరు నాటికి కేవలం 5వేల ఎకరాలలో మాత్రమే కర్ర పెండలం దుంప పంట సాగు చేసేందుకు అతి తక్కువమంది రైతులు మాత్రమే ముందుకొస్తున్నారని ఆంధ్రా శాగో మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు. కర్ర పెండలం దుంప ఆధారంగా సగ్గుబియ్యం తయారుచేసే పరిశ్రమలు రాష్ట్రంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాలలోనే కేంద్రీకృతమైఉన్నాయి. ఒకప్పుడు 38 సగ్గుబియ్యం కర్మాగారాలు ఉండేవి. నేడు కేవలం ఆరు సగ్గుబియ్యం మిల్లులకు మత్రమే పరిమితం అయ్యాయి. మెట్ట ప్రాంతాలలో వర్షాధార పంటగా సాగవుతున్న ఈ కర్ర పెండలం దుంప సాగుకు ప్రత్యామ్నాయంగా అధికశాతం రైతులు పామాయిల్ తోటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఇక్కడి నేలలు పామా యిల్ తోటల సాగుకు అనుకూలంగా ఉండడమేగాక దిగుబడులకు అధిక ధర లభించడంతో కర్ర పెండలం దుంప సాగు స్థానంలో పామాయిల్ తోటల సాగుకు రైతులు ముందుకె ళుతున్నారు. పామాయిల్ విత్తన మొక్కలు విరివిగా లభిస్తే మొత్తం అంతా పామాయిల్ తోటల సాగు చేపట్టే అవకాశాలు ఉన్నాయని కర్ర పెండలం దుంప సాగుచేసే ఆనూరుకు చెందిన రైతు బండే కొండలరావు చెప్పారు. ఇదే నిజమైతే రానున్న కాలంలో కర్ర పెండలం దుంప సాగు జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే కనమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పాలక ప్రభుత్వాల వైఖరిల కారణంగా జిల్లాలో చెరకు పంట పూర్తిగా కనమరుగు అయిన విషయం విధితమే. అదే కోవకు కర్ర పెండలం దుంప పంట కూడా చేరనుంది.


విత్తనం కర్ర ముచ్చులను నారుమడులుగా వేసిన దృశ్యం

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

రంపలో ఓట్ల లెక్కింపు కోసం
20 టేబుళ్లు-20 రౌండ్లు

- రంపచోడవరంలోనే అసెంబ్లీ, అరకు పార్లమెంటు ఓట్ల లెక్కింపు
- రాష్ట్రంలోనే అత్యధికంగా 399 పోలింగ్ కేంద్రాలకు లెక్కింపు

రంపచోడవరం, జూన్ 2: రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికలకు సంబంధించి మంగళవారం ఓట్ల లెక్కింపునకు రిటర్నింగ్ అధికారి ప్రశాంతకుమార్ అన్ని ఏర్పాట్లూ చేశారు. ఇందుకోసం 20 టేబుళ్లను ఏర్పాటు చేసి 20 రౌండ్లలో లెక్కింపును పూర్తి చేస్తారు. రంపచోడవరం నియోజకవర్గంలో 11 మండలాల్లో 399 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరిగింది. 2,77,317 మంది ఓటర్లకుగానూ పోస్టల్ బ్యాలట్‌లతో కలిపి 2,11,249మంది ఓట్లు వేశారు. అసెంబ్లీకి, అరకు పార్లమెంటుకు సంబంధించి పడిన ఓట్లను రంపచోడవరంలోనే లెక్కించనున్నారు. 1999 తర్వాత మరలా ఓట్ల లెక్కింపును రంపచోడవరంలో నిర్వహిస్తున్నారు. సాధారణంగా ఎక్కడ పార్లమెంటు నియోజకవర్గ కేంద్రం ఉంటుందో అక్కడే ఆయా సెగ్మెంట్ల ఓట్లను అసెంబ్లీతో కలిపి లెక్కిస్తారు. రంపచోడవరం విషయానికి వస్తే భౌగోళిక పరిస్థితులరీత్యా అది సాధ్యంకాక, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా ఉన్నప్పుడు రాజమండ్రి, కాకినాడలలో రంపచోడవరం ఓట్లను లెక్కించేవారు. జిల్లాల విభజన అనంతరం తిరిగి రంపచోడవరంలోనే లెక్కించాల్సి వచ్చింది. ఈ లెక్కింపు కోసం రంపచోడవరంలోని బాలికల గురుకుల విద్యాలయంలోనే స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటుచేసి, అక్కడే లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. తొలుత 14 టేబుళ్లతో 29 రౌండ్లలో లెక్కించాలని భావించినా, రాష్ట్రంలో లేటుగా ఈ ఫలితాలే విడుదల అవుతాయని ఎన్నికల సంఘం గుర్తించడంతో 20 టేబుళ్లను ఏర్పాటు చేశారు. తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. అనంతరం ఈవీఎంలలో ఓట్లను లెక్కిస్తారు. మధ్యాహ్నానికే ఈ ఫలితాల ట్రెండ్ వస్తుందని భావిస్తున్నారు.

లక్కవరం జంక్షన్‌లో వాహన తనిఖీలు



లక్కవరం జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మోతుగూడెం, జూన్2: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న లక్కవరం జంక్షన్ మూడు రోడ్ల మధ్య రాజమండ్రి, భద్రాచలం, వైజాగ్ వెళ్లే వాహనాలను మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు తన సిబ్బంది కలిసి వాహనాలు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పై అధికారుల ఆదేశాల మేరకు ఈ రోజు నుంచి ఐదో తేదీ వరకు లక్కవరం జంక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎవరు కూడా గుంపులుగుంపులుగా తిరగకూడదని ఎక్కడా కూడా ఊరేగింపులు, ర్యాలీలు బాణాసంచా కాల్చడానికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ రాజేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ రాజుమురళి, కొండబాబు, శ్రీను, తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ 521 పింఛన్లు

వై.రామవరం, జూన్2: వై.రామవరం మండలంలో ఆదివారం నాటికి 521 డోర్ డెలివరీ పింఛన్లను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 3,383 సామాజిక పింఛన్లు ఉండగా ఐటీడీఏ అధికారుల ఆదేశాలనుసారం ఇంటింటికీ ఇవ్వాల్సిన పింఛన్లు 641 ఉన్నాయి. మిగిలిని 2,942 పింఛన్లు వారివారి బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. మొత్తం పింఛన్ల సొమ్ము రూ.ఒక కోటి12వేలు విడుదలైనట్లు తెలిపారు.

పాపికొండలకు పర్యాటకుల సందడి



పాపికొండలకు వెళుతున్న బోటు

దేవీపట్నం, జూన్2: పాపికొండలకు రోజురోజుకు పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. పాపికొండల అందాలు తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. మండల పరిధిలో పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి పరి వాహక ప్రాంతాలైన పూడిపల్లి, వీరవరంలంక, కొయ్యేరు, దేవీపట్నం, అగ్రహారం, మూలపాడు, మంటూరు, మడిపల్లి, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పర్యాటక బోట్లలో ఏడు బోట్లలో సుమారు 450మంది పర్యాటకులు పాపికొండలు వెళ్లారు. ముందుగా గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని పేరంటాలపల్లిలో దర్శించుకున్నారు.

గండి పోశమ్మను దర్శించుకున్న భక్తులు

మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో పోటెత్తారు. వేకువజాము నుంచి భక్తులు వచ్చి గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

రైతులకు అందుబాటులో ఖరీఫ్ విత్తనాలు

కూనవరం, జూన్ 2: రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి పి.శ్రీలక్ష్మి తెలిపారు. వరి విత్తనాలు ఎంటీయూ 1121, బీపీటీ 5204 వరి రకాలు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో, సచివాలయాల్లో అన్ని గ్రామాలకు సంబంధించి 870 క్వింటాళ్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఖరీఫ్ విత్తనాలు 90శాతం సబ్సిడీలో వ్యవసాయశాఖ గ్రామ అసిస్టెంట్ల ద్వారా పొందగలరని తెలియజేశారు.

నేటి నుంచి వాగ్గేయకారుల కీర్తనలపై శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2: తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 3,4,5 తేదీల్లో వాగ్గేయకారుల కీర్తనలపై శిక్షణ కార్యక్ర మం నిర్వహిస్తున్నామని మంచిరాజు హేమలత తెలిపారు. ఈ మేరకు ఆది వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి రోజు ఉదయం 10నుంచి మధ్యా హ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటలకు వరకు శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి రోజు సాయంత్రం 4నుంచి 5గంటల వరకు పగడాల ఆనంద తీర్థాచార్యుల ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుందన్నారు.

కార్యకర్త మొక్కు తీర్చిన నల్లమిల్లి



బిక్కవోలు, జూన్ 2: అనపర్తి అసెంబ్లీ టికెట్ నల్లమిల్లికి కేటాయిస్తే బిక్కవోలు లక్ష్మీగణపతికి 558 కొబ్బరికాయలు ఆయనతో కొట్టిస్తానని జిల్లా వాణిజ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి గొర్రెల త్రిమూర్తులు మొక్కు కున్నారు. దీంతో ఆదివారం కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులతో 558 కొబ్బరికాయలను ఆయన కొట్టించి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం రామకృష్ణారెడ్డి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చాగంటి సాయిబాబారెడ్డి, జంపా రమణ, సింగారపు రామారావు, కొమ్మోజు శ్రీనివాస్, బేరా గోవింద పాల్గొన్నారు.

'కూటమి విజయం ఖాయం'

దివాన్‌చెరువు, జూన్ 2: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో పూర్వ తూర్పుగోదావరి జిల్లాలోని మూడు లోక్‌సభ, 19 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయదుందుభి మోగించడం ఖాయమని టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు (నాగు) ధీమా వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెజార్టీ ఎన్నికల సర్వేలు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తాయని అంచనాలు వేస్తున్నాయన్నారు. ఆ అంచనాలు తప్పక నిజమవుతాయని, ప్రజల ఆశీర్వాదంతో కూటమి ఘన విజయం సాధిస్తుందన్నారు.

వరిలో నూతన పరిశోధనలకు శ్రీకారం

ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు



దివాన్‌చెరువు, జూన్ 1: జిల్లాలోని రైతుల కమతాల్లో ప్రస్తుత పంట సీజన్ నుంచి నూతన పరిశోధనలకు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టబోతున్నారని దివాన్‌చెరువులోని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త చల్లా వెంకటనరసింహారావు ఆదివారం తెలిపారు. రైతులు నాణ్యమైన, స్థిరమైన అధిక ఆదాయం పొందే సాంకేతిక పరిజ్ఞానం, నూతన రకాలను అందించబోతున్నారన్నారు. 2024-25 సంవత్సరానికి రైతుల ప్రయోజనార్థం చేపట్టబోయే పరిశోధన కార్యాచరణను వివరించారు.

నూతన రకాలపై పరిశోధన

రైతులు ఎప్పటి నుంచో సాగు చేస్తున్న కొన్ని రకాలకు ప్రత్యామ్నాయంగా నూతన రకాలను రైతుల ముంగిటనే పరిశోధన చేసి ఫలితాలను విశ్లేషించి సిఫారసు చేస్తామన్నారు. సార్వాలో వరిలో స్వర్ణ(ఎంటీయూ-7029)కు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ-1318 రకం ఇప్పటికే జిల్లాలోని 6700 హెక్టార్లలో సాగు చేస్తున్నారన్నారు. అలాగే ఎంటీయూ-1275, ఎంటీయూ-1310 రకాలను కూడా పరిశీలిస్తామన్నారు. అలాగే బీపీటీ-5204 (సాంబమసూరి)కి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ-1271, బీపీటీ-3082 రకాలను పరిశీలిస్తామన్నారు. ఎక్కువ పోషక విలువలు ఉన్న ఎరుపురంగు బియ్యాన్నిచ్చే బీపీటీ-2858ను, నల్లరంగు బియ్యాన్నిచ్చే బీపీటీ-2841 రకాల సామర్థ్యాన్ని, దిగుబడి, నాణ్యత, చీడపీడలను తట్టుకునే శక్తిని పరిశీలిస్తామన్నారు. అంతేకాక సార్వాలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే దిశలో వరి తర్వాత దాళ్వాలో లాభదాయక పంటలపై పరిశోధన, నూతన కలుపు మందుల మూల్యాంకన, మానిపండు తెగులు యాజమాన్యం, ఎలుకల నివారణకు ఎర-తెర పద్ధతిని పరిశీలించి ఫలితాల అనుగుణంగా సిఫారసు చేయబోతున్నామని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. జిల్లాలో ముఖ్యమైన పంటలైన వరి, మొక్కజొన్నలకు ప్రత్యామ్నాయంగా ఏ మేరకు ఇతర పంటల మార్పిడి జరుగుతుందో అధ్యయనం చేస్తామన్నారు. యూనివర్శిటీ రూపొందించిన వరి రకాల వినియోగం, ధాన్యం కొనుగోలును పరిశీలిస్తామన్నారు. వచ్చే వారం నుంచే కొత్త వరి వంగడాలను ఎంపిక చేసి జిల్లాలోని రైతులకు అందజేస్తామన్నారు. పరిశోధనలకు వచ్చే సార్వా నుంచి శ్రీకారం చుట్టబోతున్నట్టు నరసింహారావు తెలిపారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి

కౌంటింగ్ ఏజెంట్ల అవగాహన సదస్సులో డీఎస్పీ శ్రీనివాస్



సదస్సులో ప్రసంగిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

కోరుకొండ, జూన్ 2: ఈ నెల 4న జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల కమిషన్ రూపొందించిన నిబంధనలు పాటించి అధికారులకు సహకరించాలని కోరుకొండ డీఎస్పీ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆదిత్య ఫంక్షన్ హాల్లో నియోజకవర్గంలోని ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. కౌంటింగ్ ఏజెంట్లు ఆల్కాహాల్ తీసుకోకూడదన్నారు.మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రికల్ వాచ్‌లు తదితర పరికరాలేవీ తమ వెంట తీసుకురాకూడదన్నారు. పోలీసులకు, ఇతర అధికారులకు పూర్తిగా సహకరించాలన్నారు. వసతి సౌకర్యాలు తెలియజేశారు. సమావేశంలో సీఐ అడపా నాగమురళి, ఎస్ఐ డి.ఆనంద్‌కుమార్, సీతానగరం ఎస్ఐ డి.రామకృష్ణ, వైసీపీ, టీడీపీ, జనసేన, కాంగ్రెస్, బీజేపీల కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్ఐ

అనపర్తి, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఈనెల 4న గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రామారావు అన్నారు. ఆదివారం పోలీసులు మండలంలోని పలు గ్రామాల్లో పోలీస్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మైక్ ద్వారా ప్రజలకు పలు సూచనలు చేశారు. ఫలితాల అనంతరం గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామన్నారు. రాజకీయ పార్టీల కార్యకర్తలు సంయమనంతో ఉండాలని, ఈనెల 6వ తేదీ వరకు సెక్షన్ 30 అమలులో ఉన్నందున ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని చెప్పారు.



అనపర్తిలో పోలీస్ మార్చ్ నిర్వహిస్తున్న సిబ్బంది

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : డీఎస్పీ రత్నస్వామి

కొవ్వూరు, జూన్ 2: ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమించి అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని న్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని రాజమహేంద్రవరం ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ టీవీ రత్నస్వామి అన్నారు. కొవ్వూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్ ఈ నెల 4న నన్నయ యూనివర్శిటీలో జరుగుతుందని, అభ్యర్థులకు ఏజెంట్లుగా వచ్చిన వారిని తమకు కేటాయించిన కౌంటరు వద్దకు మాత్రమే అనుమతిస్తారని, ఇతర కౌంటర్ల వద్దకు వెళ్లరాదన్నారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించి శాంతియుతంగా కౌంటింగ్ పూర్తిచేసేందుకు ఎన్నికల సిబ్బందికి, పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు పట్టణ, రూరల్ సీఐలు వి.జగదీశ్వరరావు, కె.శ్రీనివాసరావు, రూరల్, చాగల్లు ఎస్ఐలు కె.సుధాకర్, పి.నాగరాజు పాల్గొన్నారు.

ఎన్నికల కౌంటింగ్‌లో జాగ్రత్తగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

దివాన్‌చెరువు, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ రోజున ఈవీఎం యూనిట్లలో పోలైన ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలైన ఓట్ల లెక్కింపు సందర్భంగా అత్యంత జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఆర్వోలు, సహాయ రిటర్నింగ్ అధికారులతో లెక్కింపు రోజున నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్‌లో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు మేరకు వ్యవహరించాలన్నారు. రౌండ్‌లవారీగా ఫలితాలు ప్రకటన, గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించే క్రమంలో నిబ్బరంగా వ్యవహరించాలన్నారు. ఏజెంట్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తే వాస్తవ పరిస్థితిని వివరించి లెక్కింపు సజావుగా సాగేందుకు సమయోచితంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. లెక్కింపు సందర్భంగా అనుసరించాల్సిన విధానంపై ఎన్నికల సంఘం పంపిన సర్క్యులర్ల ఎప్పటికప్పుడు పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. అనంతరం కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన మీడియా విభాగంలో ఏర్పాటుచేస్తున్న డిజిటల్ స్క్రీన్లు తదితర ఏర్పాట్లను జేసీ తేజ్‌భరత్‌తో కలసి పరిశీలించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో, జేసీ ఎస్.తేజ్‌భరత్, రాజమండ్రిఅర్బన్ ఆర్వో, మునిసిపల్ కమీషనర్ కే.దినేష్‌కుమార్, కొవ్వూరు ఆర్వో, సబ్‌కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ్, డీఆర్వో జీ.నరసింహులు, రాజానగరం ఆర్వో, ఆర్డీఓఏ.చైత్రవర్షిణి, గోపాలపురం ఆర్వో కె.ఎల్.శివజ్యోతి, అనపర్తి ఆర్వో ఎం.మాధురీ, నిడదవోలు ఆర్వో ఆర్.వి.రమణానాయక్, రాజమండ్రిపార్లమెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్‌డిసి ఆర్.కృష్ణానాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భానుప్రకాష్, పి.సువర్ణ పాల్గొన్నారు.

నాదస్వర విద్వాంసుడు భాస్కరరావు మృతి



కడియం, జూన్ 2: ప్రముఖ నాదస్వర విద్వాంసుడు, జేగురుపాడు సంగీత వాయిద్య మండలి వ్యవస్థాపకుడు ముంగమూరి భాస్కరరావు (85) మృతి చెందారు. జేగురుపాడు మ్యూజికల్ బ్యాండ్ టీమ్ భాస్కరరావుగా ఉభయ గోదావరి జిల్లాలతో పాటు విశాఖపట్టణం తదితర ప్రాంతాల సంగీత ప్రియులకు భాస్కరరావు సుపరిచితులు. ఆయన నాదస్వరం, సన్నాయి, ట్రంపెట్, ఫ్లూట్, డ్రమ్స్ వాయించడంలో నిష్ణాతులు. సంగీత విద్వాంసుడు వెంకట్రావు శిష్యరికంలో సంగీతం నేర్చుకున్నారు. భాస్కరరావుకు భార్య, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ప్రముఖ కవి, అభ్యుదయ రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు గండి స్వామి స్వయానా అల్లుడు అవుతారు. భాస్కరరావు మృతికి సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్, పాలపర్తి ప్రకాష్, విజయవాడ రైల్వే ఏడీఈ గండి నాగేంద్రప్రసాద్, బ్యాంకింగ్ ప్రొఫెషనల్ ట్రైనీ ఎం.ప్రసాదరావు, విజయవాడ డివిజన్ రైల్వేస్కౌట్ మాస్టర్ గండి రాజేంద్రప్రసాద్, రాజమహేంద్రవరం, కాతేరు ఫీల్డ్‌లేబర్ సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు.

వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సమావేశం



రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 2: వాసవీ క్లబ్‌కు జన్మనిచ్చింది తెలుగు తల్లేనని ఆర్యవైశ్య ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎరుకుళ్ల రామకృష్ణ అన్నారు. ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జిల్లా వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జరిగిన ఆర్యవైశ్య సభ్యుల సామూహిక సమావేశంలో ఆయన మాట్లాడారు. 1962లో ఆవిర్భవించిన ఈ సేవా సంస్థ 1800 క్లబ్‌లతో 14 దేశాల్లో విరాజిల్లుతోందన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ కేవీపీఎస్ ప్రవీణ్‌కుమార్, ప్రోగ్రాం అడ్వైజర్ బోడా సాయి, ఎస్.కరుణకుమార్, ఎస్.నాగేశ్వరరావు, చెక్కా మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి-పోలేరమ్మ జాతర



కడియం, జూన్ 2: మండలంలోని జేగురుపాడులో గారపాటి వంశీయుల ఆడపడుచులుగా పూజలందుకుంటున్న మహాలక్ష్మి-పోలేరమ్మ జాతర ఘనంగా జరిగింది. టీడీపీ సీనియర్ నాయకులు గారపాటి అమరనాథ్, రిమ్మలపూడి సుబ్బారావు, గారపాటి హేమంత్ కుటుంబ సభ్యులు మహాలక్ష్మి-పోలేరమ్మలను గరగల రూపంలో ఇంటికి తీసుకొచ్చి ధూపదీప నైవేద్యాలతో పూజలు చేశారు. సారె, చీరలను అందజేశారు. మంగళవాయిద్యాల నడుమ అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఉంచారు. కార్యక్రమంలో పాతూరి సత్యనారాయణ, నాగిరెడ్డి రామకృష్ణ, కర్రి చినబాబు, వల్లూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణకు స్వరనీరాజనం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2: సూపర్‌స్టార్ కృష్ణ 81వ జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం విక్రమ్ హాల్లో ఆదివారం రాత్రి శ్రీహరి ఈవెంట్స్ ఆధ్వర్యంలో స్వరనీరాజనాలు అర్పించారు. నా పిలుపే ప్రభంజనం పేరుతో సూపర్‌స్టార్ కృష్ణ, ప్రిన్స్ మహేష్‌బాబు సినిమాల్లో పాటలతో గాయనీగాయకులు అలరించారు. అలనాటి పాటలను మొదలుకొని మహేష్‌బాబు పాటల వరకు రాజమహేంద్రవరానికి చెందిన గాయనీగాయకులు అద్భుతంగా పాడి శ్రోతలను అలరించారు. కార్యక్రమంలో కృష్ణ ఫ్యాన్స్ ఆసూరి సుధాకర్‌రావు, సలీం, ఉమా, పాపారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 2: రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులోని ఛాంబర్ భవనంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ కన్ను, గుండె, పలు విభాగాల సర్జరీ వైద్యులు, గైనకాలజీ వైద్యులు పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించారు. ఛాంబర్ మాజీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్, నందెపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వంటెద్దు సూరిబాబు, వివిధ సంఘాల ప్రతినిధులు, జట్లు లేబర్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. వైద్య శిబిరానికి సుమారు 300 మంది హాజరయ్యారని, ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్టు ఛాంబర్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, గౌరవ కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ తెలిపారు.

రాజా వారియర్స్ విజేత

ముగిసిన మునిసిపల్ కాలనీ ప్రీమియర్ లీగ్



రాజా వారియర్స్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2: రాజమహేంద్రవరం మునిసిపల్ కాలనీ గ్రౌండ్స్‌లో జరుగుతున్న మునిసిపల్ కాలనీ ప్రీమియర్ లీగ్ సీజన్ 10 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో రాజా వారియర్స్ జట్టు విజేగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో రాజా వారియర్స్, వాంబే సూపర్ కింగ్స్ జట్లు తలబడ్డాయి. రాజా వారియర్స్ విజేతగా నిలిచింది. గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి రాజా వారియర్స్ జట్టు సభ్యులకు మెమెంటో ఇచ్చి సత్కరించారు. 40 రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్లో వివిధ ప్రాంతాల నుంచి 9 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో నామాన వాసు, బూసి వజ్రనాథ్, నిర్వాహకులు రవీ, ఉమా, కోట, ఎండీ వజీర్, పురుషోత్తం, నాగార్జున, ఎంఏ రషీద్ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన బీజేపీ నాయకురాలు హారిక



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2 : రాజమహేంద్రవరానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ కరకట్టలోని బాబు నివాసంలో ఆమె ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి కూటమి విజయం సాధిస్తుందని శుభాకాంక్షలు చెప్పినట్టు ఆమె తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఎంపీగా విజయం సాధిస్తున్నారని చెప్పారు.

సంపత్ కుటుంబానికి న్యాయం చేయండి

చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు మాజీ ఎంపీ హర్ష వినతి



సీఈవో ముఖేష్‌కుమార్ మీనాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2: అనంతపూర్ విద్యార్థి నాయకుడు, ఎన్ఎస్‌యూఐ నేషనల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ దారుణ హత్యపై ఎలక్షన్ కమిషన్ స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనాను కలిసి ఆదివారం రిప్రజెంటేషన్ అందించారు. సంపత్‌కుమార్ తండ్రి ఒక ఆటోడ్రైవర్ అని అతని కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ప్రకటించాలన్నారు. సంపత్‌కుమార్ కుటుంబానికి తాను అండగా ఉంటానన్నారు.

కూటమి శ్రేణులు సంయమనం పాటించాలి

అనపర్తి కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జూన్ 2: దేశంలో విశ్వసనీయత కలిగిన సర్వే సంస్థలు రాష్ట్రంలో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందని తేల్చి చెప్పడంతో కౌంటింగ్ కేంద్రాల్లో అరాచకం సృష్టించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని కూటమి నాయకులు, కార్యకర్తలు కౌంటింగ్ కేంద్రాల్లో సంయమనం పాటించాలని అనపర్తి కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని రామవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ మీడియా సంస్థ ఇండియా టుడే ఏపీలో కూటమి విజయం సాధిస్తుందని తేల్చి చెప్పిందని అన్నారు. పరిస్థితులు అనుకూలంగా లేకపోతే అరాచకాలే లక్ష్యంగా వైసీపీ పెద్దలు పావులు కదుపుతున్నారని ఇప్పటికే వైసీపీ కుట్రలను ఎన్నికల కమిషన్, పోలీస్ శాఖ గుర్తించిందని అన్నారు. రెచ్చగొట్టే ధోరణిలో వైసీపీ నేతలు కవ్వింపులకు పాల్పడినా కూటమి నాయకులు సంయమనం కోల్పోవద్దని ఆయన కోరారు.

దేశ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం



భారత్ వికాస్ పరిషత్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 2: అన్ని రంగాల్లో భారతదేశం సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నదే లక్ష్యమని భారత్ వికాస్ సౌత్ జనరల్ సెక్రటరీ పురుషోత్తమ్‌శాస్త్రి అన్నారు. హోటల్ సూర్యలో పరిషత్ రాజమహేంద్రవరం 4శాఖల ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం నిర్వహించారు. 1963లో సంస్థ ఆవిర్భవించిందన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పరిషత్ సభ్యులు జీబీవీ సుబ్రహ్మణ్యం, తాడోజీ సాయికృష్ణ, కొత్తపల్లి వీర్రాజు, పీవీ ఎస్.కృష్ణారావు, డాక్టర్ జయప్రద, సత్తి మూలారెడ్డి, డాక్టర్ అనురాధ పాల్గొన్నారు.

చదరంగంతో ఏకాగ్రత, చురుకుదనం



చెస్ పోటీల్లో ఆడుతున్న చిన్నారులు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 2 : చదరంగం ఆడడం వల్ల ఏకాగ్రత, చురుకుదనంతో పాటు రోజంతా ఉల్లాసంగా ఉంటారని కాల్ ఫ్యూషన్ చెస్ అకాడమి డైరెక్టర్ కుమార్ విత్తనాల అన్నారు. రాజమహేంద్రవరం కాల్‌ఫ్యూషన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం చదరంగం పోటీలు జరిగాయి. అకాడమీ ఎండీ లక్ష్మీ హైమావతి మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో నెలరోజులపాటు శిక్షణ పొందిన అండర్ - 6 నుంచి 18 ఏళ్లలోపు క్రీడాకారులకు అంతర్గత పోటీలు నిర్వహించామన్నారు. అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన 55 మందికి బహుమతులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మెడల్ ప్రశంసాపత్రం అందజేసినట్టు తెలిపారు. మనోహర్, శివప్రసాద్, రాజ్‌కుమార్, దివ్య, సౌమ్య, గౌరవ్, కుమార్ రాజా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

సీతానగరం, జూన్ 2: వంగలపూడిలో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.1800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: గంగం గణేశా
సూర్యామినీ	: మిస్టర్ అండ్ మిసెస్ మహి
సూర్యాప్యాలస్	: భజే వాయువేగం
స్వామి	: భజే వాయువేగం
శివజ్యోతి	: లవ్ మీ
అనుశ్రీ(సాయికృష్ణ)	: హిట్‌లిస్ట్
రాజా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
ఊర్వశి	: ఆ ఒక్కటీ అడక్కు
రంభ	: రాజుయాదవ్
మేనక	: బాక్
అప్సర	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
వీఎస్ మహల్(నామవరం)	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
వెంకటసూర్య(కడియం)	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
సత్యగౌరి (అనపర్తి)	: బాక్
సూర్యశ్రీ (అనపర్తి)	: ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
రామకృష్ణ(కోరుకొండ)	:
గీతాసినిమాస్ (సీతానగరం)	:
శ్రీనివాస (గోకవరం)	: కృష్ణమ్మ
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
లలితామహల్(రంపచోడవరం)	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
నవయుగ(చింతూరు)	: ఆ ఒక్కటీ అడక్కు

17 కౌంటింగ్ సెంటర్లు..



17 కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో హాల్‌లోనూ 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో రౌండ్‌లోనూ 14 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈవీఎంలను లెక్కిస్తారు. పార్లమెంట్ పరిధిలో ఈవీఎం ఓట్ల లెక్కింపునకు 98 టేబుళ్లు ఉంటాయి.ఇక్కడ 116 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు. అసెంబ్లీ పరిధిలో 98 టేబుళ్లు ఉంటాయి. ఇక్కడ 116 రౌండ్లలో లెక్కిస్తారు. ఈటీపీబీఎస్ కోసం 4 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్‌కు 20 టేబుళ్లు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్లను లెక్కించడానికి ఏడుగురు సహాయ రిటర్నింగ్ అధికారులు, 119మంది సూపర్‌వైజర్లు, 126 మంది సహాయకులు, 140 మంది సూక్ష్మపరిశీలకులు, 119 మంది ఇతర సిబ్బంది ఉంటారు. కౌంటింగ్ కేంద్రాల్లో 24 గంటలూ పనిచేసేలా 152 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో 7 సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 2 కిలోమీటర్ల పరిధిలో పర్యవేక్షణకు 10 డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశారు.



ఓటు.. పవర్!

- ఓటరు ఎటువైపో..అధికారం అటువైపే
- మార్పు కోరుకున్న జనం.. ఎగ్జిట్‌పోల్స్‌లో వెల్లడి
- దేశ..విదేశాల చూపు ఏపీ ఎన్నికల వైపు
- జనంలో జోరుగా సాగుతున్న చర్చ
- జారుకుంటున్న వైసీపీ బెట్టింగ్‌బాబులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. రేపే ప్రజా తీర్పు వెలువడనుంది. మూడు నెలల తీవ్ర ఉత్కంఠకు సమాధానం రానుంది. తమ ఆకాంక్షలు నెరవేర్చే 'మార్పు' కోసం ఓటరు ఆశగా ఎదురు చూస్తున్నాడు.ఓటు తన పవర్‌ని చూపించే తరుణం ఇంకా గంటలు మాత్రమే ఉండడంతో జన సందోహంలో చర్చ తారస్థాయికి చేరింది. ఎన్నికల బరిలో ఎన్నో రాజకీయ పార్టీలు, స్వతంత్రులు నిలిచినా రెండు ప్రధాన పార్టీల నడుమే పోరు భీకరంగా సాగిందనేది బహిరంగ వాస్తవం. జిల్లాలోని పార్లమెంట్ స్థానంలో 12 మంది, అసెంబ్లీ స్థానాల్లో 71 మంది పోటీలో ఉన్నారు అయితే 16 మంది గెలుపు ఓటములపైనే ఓటర్లు దృష్టి సారించారు. ఎన్ని కల షెడ్యూల్ ముందు నుంచీ గంభీరం ప్రదర్శించిన అధికార పార్టీ.. పోలింగ్ తర్వాత గుంభనంగా మారిపోయింది. ఎగ్జిట్ పోల్స్ సర్వేలు కూటమి విజయం ఖాయమని వెల్లడించ డంతో ఆ నాయకులు మరింత మదనపడుతున్నారు. మరో వైపు బెట్టింగ్ బాబుల గుండెల్లో సైతం రైళ్లు పరుగెడుతున్నాయి. ఎగ్జిట్‌పోల్ ఫలితాలతో చాలా మంది అయోమయంలో పడి పోయారు. కూటమి అభ్యర్థులు, అభిమానుల్లో మాత్రం ఆనం దం మొదలైపోయింది.

ఎన్నడూలేని ఉత్కంఠ..

రాష్ట్రం అగాథంలో కూరుకుపోయింది. ఇటీవల పల్నాడులో చెలరేగిన అరాచకాలను రాష్ట్రం ఎన్నడూ చూడలేదు. దీంతో దేశంలోని పలు రాష్ట్రాలకు ఎన్నికలు జరిగినా ఏపీవైపే అందరి కళ్లూ చూస్తున్నాయి. అమెరికాతో సహా వివిధ దేశాల్లో ఏపీలో ఫలితాలపైనే చర్చ నడుస్తోంది. ఏ ఇద్దరు తెలుగువారు కలుసుకున్నా ఏపీలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే అంశంపైనే మాటలు సాగుతున్నాయి. ఐదేళ్ల రాష్ట్రం చీకటిలోకి జారుకోవడం, అరాచకాలు, అవినీతి, అక్రమాలు హద్దు మీరడం. సామాన్యుడు బతకలేని దుస్థితి దాపురించడం వంటివి ఏపీవైపు ఇతర రాష్ట్రాలు, దేశాల్లోని ప్రజలు జాలిగా చూసే పరిస్థితిని తెచ్చాయి. ఉత్తుత్తి బటన్‌కి ప్రజాస్వామ్య బటన్‌కి తేడా స్పష్టమయ్యే రోజు రేపే కావడంతో లోకం ఏపీవైపే చూస్తోంది.

బెట్టింగ్ బాబుల గుండెల్లో రైళ్లు

మూడు నెలల నుంచీ ఎన్నికల బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్న విషయం తెలిసిందే. వందల కోట్ల రూపాయలు బెట్టింగ్‌లు కాస్తున్నారు. వైసీపీ అభిమానులు అటువైపు, కూటమి అభిమానులు ఇటువైపు పందెం బరిలో దిగారు. కూటమిపై కోసు పందేలు కాశారు. ఇప్పుడు ఎగ్జిట్‌పోల్స్ రూపంలో ఓటరు నాడి బయటకు రావడంతో వైసీపీ తరపున పందేలు కాసిన వాళ్ల బుర్రలు వేడెక్కిపోతున్నాయి. చేతురాలా డబ్బు నాశనం చేసుకున్నామా? అనే నైరాశ్యం వారిలో తాండవిస్తోంది. దీంతో తాము పందెంలో పెట్టిన డబ్బులు ఎంతో కంత తగ్గించుకొని మిగతా సొమ్ము వెనక్కు ఇచ్చేయాలంటూ వైసీపీ తరఫున పందెం కాసిన వాళ్లు అవతలి వాళ్ల కాళ్లావేళ్లా పడుతున్నారనే చర్చ నడుస్తోంది. ఓ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిపై రూ.25 లక్షలు పందెంలో పెట్టిన ఓ పెద్దాయన ఇప్పుడు పైన రూ.5 లక్షలు తగ్గించుకుని రూ.20లక్షలు తిరిగి ఇచ్చేసి పందెం రద్దు చేసుకోవాలని బతిమలాడుతున్నాడట. అవతలి వారితో మాట్లాడి సెటిల్ చేస్తే కమీషన్ కూడా ఇస్తానని చెబుతున్నాడని సమాచారం. ఇలా ఎగ్జిట్‌పోల్ ఫలితాలతో అంచనాలు తారుమారయ్యాయి. మరోవైపు 40 కంపెనీల ఎగ్జిట్‌పోల్స్‌లో 36 కంపెనీలు కూటమికే జై కొట్టడంతో వైసీపీ నాయకులు లోలోపల మరింత రగిలిపోతున్నారు. జిల్లా గుంభనంగా ఉన్నా సున్నితమైన ప్రాంతాలు ఉన్నాయి. రెచ్చగొట్టే నాయకులు ఉన్నారు. మూడు నెలల నుంచీ విధులు ఓ ఎత్తు. రేపు నిర్వర్తించబోయే విధులు మరో ఎత్తు కావడంతో పోలీసు వర్గాల్లోనూ టెన్షన్ నెలకొంది. స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలనూ మోహరించారు. కౌంటింగ్ రోజున అనవసరంగా బయట తిరగవద్దని ఎస్పీ ఇప్పటికే సూచించడం గమనార్హం.

24 గంటలే!

JUNE 04



రేపే ప్రజాతీర్పు



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ మాధవీలత

- కౌంటింగ్‌కు సర్వం సిద్ధం
- నన్నయ వర్సిటీలో ఏర్పాట్లు పూర్తి
- లోక్‌సభ, 7 అసెంబ్లీ ఫలితంపై ఉత్కంఠ
- 232 రౌండ్లలో లెక్కింపు
- ఒక్కో హాల్‌లో 14 టేబుళ్లు
- 12.30 గంటలకే తొలి ఫలితం
- 2 గంటలకు ముగిసేలా ఏర్పాట్లు
- యూనివర్సిటీ వద్ద కట్టుదిట్టమైన భద్రత
- 152 సీసీ కెమెరాలతో నిఘా
- సెక్షన్ 144, పోలీసు యాక్ట్ 30 అమలు
- రేపు ఉదయం 8 నుంచే కౌంటింగ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల నిరీక్షణకు మరికొన్ని గంటల్లో తెరపడనుంది.. ఇప్పటికే ఎగ్జిట్ పోల్ ఫలితాలతో ఒక అంచనాకు వచ్చారు.. కూటమికే జైకొట్టడంతో వైసీపీ నాయకులు డీలా పడ్డారు. ఇదిలా ఉండగా రేపే ఓట్ల లెక్కింపు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకల్లా తుది ఫలితం వెలువడనుంది. గత నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓట్లను మంగళవారం ఆదికవి నన్నయ వర్సిటీలో లెక్కించనున్నారు.ఈవీఎంలు,వీవీ ప్యాట్స్ ఇక్కడ స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. మంగళవారం ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ఆరంభిస్తారు. వీటి కోసం 17 కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో సెంటరులోనూ 14 టేబుళ్ల వంతున ఏర్పాటు చేశారు. జిల్లాలో 1577 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 98 టేబుళ్ల పరిధిలో 116 రౌండ్లలో లెక్కిస్తారు. జిల్లాలో ఈటీ పీబీ ఓటర్లు 405 మంది, పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు 15,383 మంది ఉన్నారు. జిల్లాలో మొత్తం 16,23,149 మంది ఓట ర్లు ఉండగా 13,13,645 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది 80.93 శాతం. జిల్లాలో రాజ మహేంద్ర వరం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న సంగతి తెలిసిందే. వీటి పరిధిలో మొత్తం 83 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ప్రధాన పోటీ టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి, వైసీపీ మధ్యే ఉంటుంది.కాంగ్రెస్ కూడా తన బల నిరూపణ చేసుకోనుంది. ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు మొదలవుతుంది. మొదటి రెండు రౌండ్ల వరకూ ఒక్కో రౌండ్‌కు 30 నిమిషాలు పడుతుంది. తర్వాత ఒక్కో రౌండ్ 20 నిమిషాల్లోనే లెక్కింపు పూర్తవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. కేవలం 13 రౌండ్లు ఉండడం వల్ల కొవ్వూరు ఫలితం మధ్యాహ్నం 12.30 గంటల్లోపే వెలువడుతుంది. 20 రౌం డ్లు ఉన్న రాజమహేంద్రవరం రూరల్ ఫలితం మధ్యాహ్నం 2 గంటలకు చివరిగా వెలువడుతోంది. మధ్యాహ్నం 2గంటలకు మొత్తం కౌంటింగ్ ముగించాలని అంచనా వేస్తున్నారు. సాయంత్రం 6 గంటలలోపు విజే తలకు సర్టిఫికెట్లు అందజేస్తారు.

17 రౌండ్లలో అనపర్తి ఓట్ల లెక్కింపు

అనపర్తి నియోజకవర్గంలో ఓట్లను 17 రౌండ్లలో లెక్కిస్తారు. మొత్తం 2,26,053 మంది ఓటర్లు ఉండగా 1,94,924 మంది ఓటేశారు.ఇది 86.23 శాతం. ఇక్కడ మొత్తం 228 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో రౌండ్‌లోనూ 14 టేబుళ్లలో 14 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కిస్తారు. నన్నయ వర్సిటీ ఎన్.బ్లాక్ 215,216 రూమ్‌లలో పార్లమెంట్ అభ్యర్థులకు పోలైన ఓట్లు, అసెంబ్లీ అభ్యర్థులు ఓట్లను 218, 218ఏ హాళ్లలోనూ లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్‌లు లెక్కించడానికి 2 టేబుళ్లు ఏర్పాటు చేశారు.

రాజానగరంలో 16 రౌండ్లు

రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 216 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 2,16,491 మంది ఓటర్లు ఉండగా 1,89,505 ఓటేశారు.ఇది 87.53 శాతం. 16 రౌండ్లలో లెక్కిస్తారు.నన్నయ వర్సిటీ ఇంజనీరింగ్ వర్క్‌షాప్ భవనంలో లెక్కిస్తారు.పోస్టల్ బ్యాలెట్ ఓట్లను 4 టేబుళ్ల పరిధిలో మొదటి అంతస్తులోనే లెక్కిస్తారు.

భారీ భద్రత ఏర్పాట్లు

నన్నయ్య విశ్వవిద్యాలయంలో కౌంటింగ్ సెంటర్ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. యూనివర్సిటీ ఆవరణ నుంచి కిలోమీటరు పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పోలీసు యాక్ట్ 30 కూడా అమలులో ఉంటుంది.ఒక కంపెనీ కేంద్ర ఆర్మ్‌డ్ బలగాలు,ఒక ప్లాటూన్ ఏపీఎస్పీ బలగాలు, ఇద్దరు అద నపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు,9 మంది సీఐలు, 16 మంది ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు,30 మంది ఏఆర్ఎస్ఐలు, 25 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 63 మంది హోంగార్డులు, 128 మంది పోలీసు కానిస్టేబుళ్లను నియమించినట్టు ఎస్పీ తెలిపారు.

రాజమండ్రి సిటీలో 17 రౌండ్లు

రాజమండ్రి సిటీ పరిధిలో 237 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 2,67,484 ఓటర్లు ఉండగా 1,80,733 మంది ఓటేశారు. ఇది 67.57 శాతం. వీటిని 17 రౌండ్లలో లెక్కిస్తారు.నన్నయ వర్సిటీ ఎన్ బ్లాక్ ఈస్ట్ వింగ్‌లో లెక్కిస్తారు.319వ హాల్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారు.

రాజమండ్రి రూరల్‌లో 20 రౌండ్లు

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో 267 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 2,72,826 మంది ఓటర్లు ఉండగా 1,99,220 మంది ఓటేశారు. ఇది 73.02 శాతం. 20 రౌండ్లలో లెక్కిస్తారు. నన్నయ వర్సిటీ ఎన్ బ్లాక్‌లో ఓట్లను లెక్కిస్తారు. 113వ రూమ్‌లో 5 టేబుళ్లలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. జిల్లాలో చివరగా ఈ ఫలితమే వెలువడుతుంది.

కొవ్వూరులో 13 రౌండ్లు

కొవ్వూరు నియోజకవర్గంలో 176 పోలింగ్ కేం ద్రాలు ఉన్నాయి.మొత్తం 1,84,136 ఓటర్లు ఉండగా 1,58, 176 మంది ఓటేశారు.ఇది 85.90 శాతం. 13 రౌం డ్లలో లెక్కిస్తారు.నన్నయ వర్సిటీ ఎస్‌బ్లాక్ రెండో అం తస్తులో ఓట్లు లెక్కిస్తారు.పోస్టల్ బ్యాలెట్ ఓట్లను 4 టేబుళ్లలో లెక్కిస్తారు.జిల్లాలో మొదటగా వెలువడే ఫలితమిదే.

నిడదవోలులో 15 రౌండ్లు

నిడదవోలు నియోజకవర్గంలో 205 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 2,13,396 మంది ఓటర్లు ఉండగా 1,80,688 మంది ఓటేశారు. ఇది 84.67 శాతం. 15 రౌండ్లలో లెక్కిస్తారు.నన్నయ వర్సిటీ ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్ దిగువ అంతస్తులో లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను మూడే టేబుళ్లలో లెక్కిస్తారు.

గోపాలపురంలో 18 రౌండ్లు

గోపాలపురం నియోజకవర్గంలో 248 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 2,42,763 మంది ఓటర్లు ఉండగా 2,10,399 మంది ఓటేశారు. ఇది 86.67 శాతం. ఈ ఓట్లను 18 రౌండ్లలో లెక్కిస్తారు.నన్నయ వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్ మొదటి అంతస్తులోని ఉత్తరం వైపు కాన్ఫరెన్స్ హాల్‌లో ఓట్లు లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను 2 టేబుళ్లలో లెక్కిస్తారు.

విజేతలెవరో..

ఒక్కరోజులోనే విజేతలెవరో..పరాజితులెవరో తేలిపోనుంది. జిల్లాలో రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు, అనపర్తి, రాజానగరం,రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న సంగతి తెలిసిందే.వీటి పరిధిలో మొత్తం 83 మంది పోటీ చేశారు. అసెంబ్లీల నుంచి మొత్తం 71 మంది పోటీ చేశారు. వారిలో ఏకంగా 59 మంది స్వతంత్ర అభ్యర్థులు. రాజమండ్రి లోక్‌సభ నుంచి టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి తరపున బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఆమెకే గెలుపు అవకాశాలు ఉన్నాయని అంచనా.ఆమెకు పోటీగా వైసీపీ నుంచి డా.గూడూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఈ పార్లమెంట్ స్థానం నుంచి మొత్తం 12 మంది పోటీపడ్డారు. కూటమి తరపున ఆదిరెడ్డి వాసు (రాజమండ్రిసిటీ),గోరంట్ల బుచ్చయ్యచౌదరి (రాజమండ్రి రూరల్),బత్తుల బలరామకృష్ణ (రాజానగరం), నల్లమిల్లి రామకృష్ణారెడ్డి(అనపర్తి), ముప్పిడి వేంకటేశ్వరరావు(కొవ్వూరు), కందుల దుర్గేష్(నిడదవోలు), మద్దిపాటి వెంక ట్రాజు(గోపాలపురం) నుంచి పోటీ చేశారు.వీరిలో కందుల దుర్గేష్, బత్తుల బలరామకృష్ణ జనసేన, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బీజేపీ తరపున కూటమి అభ్యర్థులుగా పోటీ చేశారు. వైసీపీ నుంచి మార్గాని భరత్ రామ్(రాజమండ్రి సిటీ), చెల్లుబోయిన వేణు(రాజమండ్రి రూరల్), జక్కంపూడి రాజా(రాజానగరం),సత్తి సూర్యనారాయణరెడ్డి (అనపర్తి), తలారి వెంకట్రావు(కొవ్వూరు),జి.శ్రీనివాసనాయుడు (నిడదవోలు),తానేటివనిత(గోపాలపురం) నుంచి పోటీ చేశారు.



నన్నయ వర్సిటీ గేటు ముందు బారికేడ్లు

సమన్వయంతో పనిచేయండి : మాధవీలత

దివాన్‌చెరువు, జూన్ 2 : లెక్కింపు సిబ్బంది విధులు నిర్వహణలో చక్కటి పనితీరు కనబరచాలని, సమన్వయం చేసుకోవడం కీలకమని జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన లెక్కింపు సిబ్బంది క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మంగళవారం లెక్కింపు విధుల్లో పాల్గొనే అధికారులను, సిబ్బందిని తొలి ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేశామన్నారు. ఎన్నికల పరిశీలకుల సమక్షంలో రెండో ర్యాండమైజేషన్ చేసి నియోజకవర్గాలవారీగా కేటాయించినట్టు తెలిపారు.లెక్కింపు రోజున ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలైన ఓట్లు లెక్కింపుపై అవగాహన కల్పించామన్నారు. వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకునే క్రమంలో లెక్కింపు ప్రక్రియపై ఆదివారం శిక్షణ ఇచ్చామన్నారు. ఓట్లు లెక్కింపు జరిగే నాలుగో తేదీ ఉదయం 5 గంటల తదుపరి నియోజకవర్గంలో నిర్దేశించిన లెక్కింపు టేబుళ్లకి అధికారులు, సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా బృందాలుగా సాంకేతికపరమైన విధానంలో ఎంపిక చేస్తామన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు అందుబాటులో రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి ఉంటారన్నారు.పార్లమెంటు పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపునకు నన్నయ వర్సిటీ పరిపాలనా భవనంలో 15 టేబుల్స్ ఏర్పాటు చేశామని తెలిపా రు.కార్యక్రమంలో డీఆర్వో జి.నరసింహులు, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.కృష్ణనాయక్,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు సిద్ధమా..?

రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2 : కౌంటింగ్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. నన్నయ వర్సిటీలో ఈనెల 4న నిర్వహించే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లపై ఆదివారం వెలగపూడి సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత పాల్గొన్నారు.కౌంటింగ్ ప్రక్రియకు చేసిన ఏర్పాట్లను వివరించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాట్లు చేశామని తెలిపారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత చేపట్టాల్సిన కార్యకలాపాలపై అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.సజావుగా కౌంటింగ్ చేపట్టేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

రాజమహేంద్రవరం చేరుకున్న పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 2 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, కూటమి ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం రాజమహేంద్రవరంలోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ నెల 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పురందేశ్వరి రాజమహేంద్రవరం వచ్చిన వెంటనే కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే ముఖ్యమైన ఏజెంట్లు, పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఓట్ల లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పురందేశ్వరిని పలువురు బీజేపీ, తెలుగుదేశం, కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనపర్తి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మండపేట తెలుగుదేశం అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు పురందేశ్వరిని కలిశారు.

టోల్ బాదుడు

- ఎన్నికల ముగింపు..వెంటనే పెంపు
- ఏప్రిల్ ఒకటి నుంచే పెంచాలి
- అడ్డంకిగా మారిన ఎన్నికలు
- హడావుడిగా ఆదివారం ఉత్తర్వులు
- ఐదు శాతమే పెంచినట్టు వెల్లడి
- 10 నుంచి 20శాతం పెంపు
- వాహనదారుల లబోదిబో



గొల్లప్రోలు, జూన్ 2: ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే వాహనదారులకు భారీ షాక్ తగిలింది. టోల్ బాదుడు మొదలైంది. ఆదివారం అర్ధరాత్రి దాటిన దగ్గర నుంచి దేశవ్యాప్తంగా ఉన్న టోల్‌ప్లాజాల్లో చార్జీలను పెంచుతూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఐదు శాతమే పెంచామని నేషనల్ హైవే అథారిటీ చెబుతున్నా అంతకంటే అధికంగా చార్జీలను పెంచారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ,అసెంబ్లీల ఎన్నికల పోలింగ్ ముగియడంతో ప్రజలపై భారం మోపేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వలేదంటూ సాకులు చెబుతూ పోలింగ్ ముగిసిన వెంటనే భారం మోపడంపై వాహనదారులు మండిపడుతున్నారు.ఐదు శాతమే పెంచుతున్నామని అధికారులు చెబుతున్నా వాస్తవంగా కొన్ని కేటగిరీ వాహనాలకు 10 నుంచి 20 శాతం వరకూ చార్జీలను పెంచేశారు.

గామన్ బ్రిడ్జిపై టోల్‌గేట్..

కాకినాడ జిల్లాలో 216వ జాతీయ రహదారిపై పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల గొల్లప్రోలు టోల్‌ప్లాజా, తుని-రాజమహేంద్రవరం మధ్య గల 16వ నెంబరు జాతీయ రహదారిపై గల కృష్ణవరం, కొవ్వూరు - రాజమహేంద్రవరం గామన్ బ్రిడ్జిపై టోల్‌ప్లాజా వద్ద వసూలు చేసే చార్జీలను పెంచారు. పెంచిన చార్జీలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చాయి. సాధారణంగా ప్రతి ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ ఒకటో తేదీన దేశవ్యాప్తంగా టోల్‌గేట్లు వద్ద వసూలు చేసే చార్జీలను సవరిస్తూ ఉంటారు. ఈ పర్యాయం అప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడం, ఏడు విడతల పోలింగ్ ముందు ఉన్న నేపథ్యంలో చార్జీలు పెంచాలన్న నేషనల్ హైవే అథారిటీ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. అయితే చార్జీల పెంపునకు ఎన్నికల కమిషన్ అంగీకరించలేదంటూ అప్పట్లో చెప్పుకొచ్చారు.ఎన్నికల చివరి దశ పోలింగ్ జూన్ ఒకటో తేదీన ముగియడంతోనే మరలా టోల్ చార్జీల పెంపు నిర్ణయాన్ని తెరపైకి తెచ్చారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి టోల్ చార్జీలను పెంచాలని నేషనల్ హైవే అథారిటీ నిర్ణయించింది.ఆ మేరకు ఆదేశాలు జారీ చేయడంతో పెరిగిన చార్జీలు అమల్లోకి వచ్చాయి.

ఆదివారం నుంచే వసూళ్లు..

గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద వాహనదారులు నుంచి ఆదివారం అర్ధరాత్రి నుంచి పెరిగిన చార్జీలను వసూలు చేయడం ప్రారంభించారు. కారు, జీపు, వ్యాన్, ఇతర తేలికపాటి వాహనాలకు ఇప్పటి వరకూ ఒకవైపు టోల్ చార్జీలు రూ.45 ఉండగా ఆ చార్జీలను రూ.50లకు పెంచారు. 24 గంటల్లోపు తిరిగి వస్తే రెండు వైపులా చార్జీ రూ.75లకు పెరిగింది. తేలికపాటి వ్యాపార వాహనాలు, మినీబస్సులు ఒకవైపు చార్జీ రూ.75 ఉండగా రూ.80కి పెంచారు. రెండు వైపులా చార్జీని రూ.115 నుంచి 120కి, మూడు యాక్సిల్స్ ఉన్న కమర్షియల్ వాహనాల ఒకవైపు టోల్‌చార్జీలు రూ.175 నుంచి 185, రెండు వైపులా చార్జి రూ.260 నుంచి రూ.280లకు, బస్సు లేదా ట్రక్‌కు రూ.160 నుంచి 170కి, రెండు వైపులా చార్జీని రూ.240 నుంచి రూ.255కి పెంచారు. భారీ నిర్మాణ మెషినరీ, మల్టీ యాక్సిల్ (4లేదా 6) వాహనాలకు ఒక వైపు చార్జీ రూ.250 నుంచి రూ.270, రెండు వైపులా చార్జీని రూ.375 నుంచి రూ.400, ఏడు లేదా అంతకంటే పెద్ద యాక్సిల్స్ కలిగిన వాహనాలకు ఒకవైపు టోల్ చార్జీలు రూ.265 నుంచి ఏకంగా రూ.325కి పెంచారు. రెండు వైపులా చార్జీని రూ.455 నుంచి రూ.490కి పెంచారు. లోకల్ వాహనాలకు నెలవారీ పాస్ చార్జీలను రూ.300 నుంచి రూ.340కి పెంచారు. 16వ జాతీయరహదారిపై గల కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద ఇదే రీతిలో చార్జీలు పెరిగాయి. రాజమహేంద్రవరం-కొవ్వూరు గామన్ బ్రిడ్జిపై టోల్ చార్జీలు ఈ నిష్పత్తిలోనే పెరిగినట్టు సమాచారం. ఒకే సారి భారీగా చార్జీలు పెంచడంతో వాహనదారులు షాక్‌కు గురయ్యారు. విషయం తెలియని వాహనదారులు తమ వద్ద ఎందుకు అధికంగా టోల్ చార్జీలు కట్ చేశారంటూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల ముందు టోల్‌చార్జీలను పెంచితే వ్యతిరేకత వస్తుందనే కేంద్ర ప్రభుత్వం పెంచకుండా పోలింగ్ ముగియగానే పెంచిందని వాహనదారులు మండిపడుతున్నారు.



వేటుపడిన డీఎస్పీ రామారావు



కొత్తగా నియమితులైన శ్రీనివాసమూర్తి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొవ్వూరు డీఎస్పీపై వేటు

- ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యమే కారణం
- క్రైమ్ డీఎస్పీ శ్రీనివాసమూర్తికి బాధ్యతలు

రాజమహేంద్ర వరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించిన పోలీస్ అధికారిపై వేటు పడింది. కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు విధుల్లో అలసత్వం వహించడం, కింది సిబ్బందిని వేధించడం, అక్రమార్కులతో చేతులు కలపడంపై 'పోలీస్ దందా' పేరుతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడిన విషయం తెలిసిందే. ఈ కథనం పోలీసు వర్గాల్లో సంచలనం రేపింది. ఉన్నతాధికారులు తక్షణమే రంగంలోకి దిగారు. వేగంగా దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు.సాయంత్రానికి రామారావును విధుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. విజయవాడలోని డీజీపీ కార్యాల యంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. కొత్త డీఎస్పీ(ఇన్‌చార్జి ఎస్ డీపీవో)గా జిల్లాలోని క్రైం డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న కె.శ్రీనివాసమూర్తిని నియమించారు.ఆయన ఆదివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. రామారావు గుంటూరు నుంచి ఎన్నికల కోటాలో బదిలీపై ఈ ఫిబ్రవరిలో జిల్లాకు వచ్చారు. రామారావు బదిలీపై సబ్-డివిజన్‌లోని బాధిత సిబ్బంది ఆనందం వ్యక్తం చేయడం గమనార్హం.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

'కూటమి విజయం ఖాయం'

దివాన్‌చెరువు, జూన్ 2: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో పూర్వ తూర్పుగోదావరి జిల్లాలోని మూడు లోక్‌సభ, 19 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయదుందుభి మోగించడం ఖాయమని టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు (నాగు) ధీమా వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెజార్టీ ఎన్నికల సర్వేలు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తాయని అంచనాలు వేస్తున్నాయన్నారు. ఆ అంచనాలు తప్పక నిజమవుతాయని, ప్రజల ఆశీర్వాదంతో కూటమి ఘన విజయం సాధిస్తుందన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, జూన్ 2: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు, క్షీర నివేదన, మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. అమ్మవారికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజా టికెట్ల ద్వారా రూ.1,54,512 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

రఘురామకృష్ణంరాజును కలిసిన ద్విసభ్య కమిటీ



రఘురామకృష్ణంరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యులు

కొవ్వూరు, జూన్ 2: ఉండి కూటమి అభ్యర్థి రఘురామ కృష్ణ రాజును కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి నల్లజర్లలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం నల్లజర్లలో జరిగిన ప్రైవేటు కార్యక్రమంలో రఘురామకృష్ణంరాజు పాల్గొన్నారు. అదే కార్యక్రమానికి హాజరైన కొవ్వూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరరావు, ద్విసభ్య కమిటీ ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పొట్రు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్'

కొవ్వూరు, జూన్ 2: రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మిగిలిపోయిందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొంతా శ్యాం రవిప్రకాష్ అన్నారు. తెలుగుజాతి విద్రోహ దినంగా జూన్ 2తో దశాబ్ద కాలం పూర్తయ్యిందని రాష్ట్రానికి ప్రత్యేక హోదా పదేళ్ల కావాలని రాజ్యసభలో పోరాడిన వెంకయ్యనాయుడు కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆంధ్రప్రదేశ్‌కి తీరని ద్రోహం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. నేటితో హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అంశం పూర్తయ్యిందన్నారు. పదేళ్లుగా రాష్ట్రంలో ప్రభుత్వాలు అభివృద్ధిపై దృష్టి సారించకుండా అవినీతిపై పాలన సాగించారన్నారు. కనీసం పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయలేక పోయారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమర్థవంతమైన ముఖ్యమంత్రి రాష్ట్రానికి చాలా అవసరమన్నారు.

సూరపనేని చిన్ని జన్మదిన వేడుకలు



చిన్నికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

కొవ్వూరు, జూన్ 2: కొవ్వూరు మున్సిపల్ మాజీ చైర్మన్, టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని సూర్యభాస్కర రామ్మోహన్ (చిన్ని) జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం కొవ్వూరులోని అయన నివాసంలో కేక్ కట్‌చేసి స్వీట్స్ పంచారు. చిన్నికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంతమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, నాదెళ్ల శ్రీరామ్, కురుకూరు బుజ్జి, కాగిత రఘు, బర్ల శ్రీనివాస్, బొబ్బిలి పేర్రాజు, వల్లభని శివరామకృష్ణ, కంటమణి చరణ్, కంటమణి రామకిషోర్, సూరపనేని సోమయ్య, పెనుమాక జయరాజు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సాయికృష్ణకు డాక్టరేట్ ప్రదానం



నల్లజర్ల, జూన్ 2: మండలంలోని అనంతపల్లికి చెందిన అధ్యాపకుడు నల్లజర్ల సాయికృష్ణకు విశాఖపట్నం గీతం యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. సాయికృష్ణ నల్లజర్ల ఏకేఆర్‌జీ ఫార్మసీ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. జీర్ణకోశ వ్యాధులైన హెమరాయిడ్స్‌పై గీతం యూనివర్శిటీ ప్రొఫెసర్ గంటా సుహాసిని పర్యవేక్షణలో పరిశోధన వ్యాసం సమర్పించినందుకు తనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్టు సాయికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ఏకేఆర్‌జీ విద్యా సంస్థల చైర్మన్ చావా గోకుల్, కార్యదర్శి వడ్లమూడి రామారావు, ప్రిన్సిపాల్ పి.రఘువీరవర్మ, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

అభయాంజనేయస్వామి పూజలు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న పండితులు

చాగల్లు, జూన్ 2: చాగల్లులోని అభయాంజనేయస్వామి జయంతి వేడుకలు సందర్భంగా ఆదివారం స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, నదీ జలాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలవలపల్లి వారితో భజన కాలక్షేపం జరిగింది. వేదపండితుడు లింగాల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు, శ్రీఅభయాంజనేయ సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

సంపత్ కుటుంబానికి న్యాయం చేయండి

చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు మాజీ ఎంపీ హర్ష వినతి



సీఈవో ముఖేష్‌కుమార్ మీనాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2: అనంతపూర్ విద్యార్థి నాయకుడు, ఎస్ఎస్‌యూఐ నేషనల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ దారుణ హత్యపై ఎలక్షన్ కమిషన్ స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనాను కలిసి ఆదివారం రిప్రజెంటేషన్ అందించారు. సంపత్‌కుమార్ తండ్రి ఒక ఆటోడ్రైవర్ అని అతని కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ప్రకటించాలన్నారు. సంపత్‌కుమార్ కుటుంబానికి తాను అండగా ఉంటానన్నారు.

కూటమి శ్రేణులు సంయమనం పాటించాలి

అనపర్తి కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జూన్ 2: దేశంలో విశ్వసనీయత కలిగిన సర్వే సంస్థలు రాష్ట్రంలో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందని తేల్చి చెప్పడంతో కౌంటింగ్ కేంద్రాల్లో అరాచకం సృష్టించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతుందని కూటమి నాయకులు, కార్యకర్తలు కౌంటింగ్ కేంద్రాలలో సంయమనం పాటించాలని అనపర్తి కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని రామవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ మీడియా సంస్థ ఇండియా టుడే ఏపీలో కూటమి విజయం సాధిస్తుందని తేల్చి చెప్పిందని అన్నారు. పరిస్థితులు అనుకూలంగా లేకపోతే అరాచకాలే లక్ష్యంగా వైసీపీ పెద్దలు పావులు కదుపుతున్నారని, ఇప్పటికే వైసీపీ కుట్రలను ఎన్నికల కమిషన్, పోలీస్ శాఖ గుర్తించిందని అన్నారు. రెచ్చగొట్టే ధోరణిలో వైసీపీ నేతలు కవ్వింపులకు పాల్పడినా కూటమి నాయకులు సంయమనం కోల్పోవద్దని ఆయన కోరారు.

రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దు



నన్నయ వర్శిటీలో భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ రవిప్రకాష్

- ఎస్ఈబీ కమిషనర్ రవిప్రకాష్
- లెక్కింపు ప్రాంతంలో మూడంచెల భద్రత : ఎస్పీ జగదీశ్

దివాన్‌చెరువు, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సెక్షన్ సీఆర్‌పీసీ, సెక్షన్ పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరూ ఉద్వేగపూర్వక, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్, ఓట్ల లెక్కింపు నిమిత్తం ఏలూరు రేంజ్‌కు ప్రత్యేకాధికారిగా నియమితులైన ఎం.రవి ప్రకాష్ హెచ్చరించారు. ఆదికవి నన్నయ విద్యాలయాన్ని ఆదివారం ఎస్పీ పి.జగదీశ్‌తో కలసి ఆయన ఆదివారం సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, బందోబస్తు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం రవిప్రకాష్ మాట్లాడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించకూడదన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ కేడరు అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా చూసుకోవాలన్నారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ ట్రయల్ రన్ ఆదివారం నిర్వహించామన్నారు. లెక్కింపు జరిగే ప్రాంతంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని, అలాగే 152 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, కంట్రోల్ రూమ్ సిబ్బంది ద్వారా వాటిని మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. లెక్కింపు సిబ్బంది, ఏజెంట్లు, జనరల్ ఏజెంట్లు, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తామన్నారు. దీని కోసం 40 డీఎఫ్ఎండీఎస్, శిక్షణ పొందిన సిబ్బందిని నియమించామన్నారు. మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. లెక్కింపు సిబ్బందికి, ఏజెంట్లకు పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ ద్వారా సూచనలిస్తామన్నారు. అత్యవసర ఏర్పాట్లలో భాగంగా అక్రమంగా గుమిగూడిన వారిని చెదరగొట్టడానికి వజ్రవాహనం, టియర్ గ్యాస్ ఎక్విప్‌మెంట్, అం బులెన్స్, ఫైరింజన్‌ను ఏర్పాటు చేసినట్టు ఎస్పీ చెప్పారు. లెక్కింపు అనంతరం అవాంఛనీయ సంఘటనలను నిరోధించే క్రమంలో 129 సమస్యాత్మక గ్రామాలను, ప్రాంతాలను గుర్తించి ఆ ప్రదేశాల్లో 39 పోలీస్ పికెట్‌లు, 59 మొబైల్ పార్టీలను, 13క్యూఆర్టీ బృందాలను నియమించామన్నారు. అభ్యర్థుల ఇళ్ల వద్ద, పార్టీ కార్యాలయాల వద్ద పికెట్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓట్లు లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు జిల్లా ప్రజలు, మీడియా మిత్రులు పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు : డీఎస్పీ

కొవ్వూరు, జూన్ 2: ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమించి అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని న్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని రాజమహేంద్రవరం ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ టీవీ రత్నస్వామి అన్నారు. కొవ్వూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ ఈ నెల 4న నన్నయ యూనివర్శిటీలో జరుగుతుందని, అభ్యర్థులకు ఏజెంట్లుగా వచ్చిన వారని తమకు కేటాయించిన కౌంటరు వద్ద మాత్రమే అనుమతిస్తారని, ఇతర కౌంటర్ల వద్దకు వెళ్లరాదన్నారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించి శాంతియుతంగా కౌంటింగ్ పూర్తిచేసేందుకు ఎన్నికల సిబ్బందికి, పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు పట్టణ, రూరల్ సీఐలు వి.జగదీశ్వరరావు, కె.శ్రీనివాసరావు, రూరల్, చాగల్లు ఎస్ఐలు కె.సుధాకర్, పి.నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ రత్నస్వామి

కౌంటింగ్‌లో జాగ్రత్తగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

దివాన్‌చెరువు, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ రోజున ఈవీఎం యూనిట్లలో పోలైన ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలైన ఓట్ల లెక్కింపు సందర్భంగా అత్యంత జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఆర్వోలు, సహాయ రిటర్నింగ్ అధికారులతో లెక్కింపు రోజున నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్‌లో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు మేరకు వ్యవహరించాలన్నారు. రౌండ్‌లవారీగా ఫలితాలు ప్రకటన, గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించే క్రమంలో నిబ్బరంగా వ్యవహరించాలన్నారు. ఏజెంట్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తే వాస్తవ పరిస్థితిని వివరించి లెక్కింపు సజావుగా సాగేందుకు సమయోచితంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. లెక్కింపు సందర్భంగా అనుసరించాల్సిన విధానంపై ఎన్నికల సంఘం పంపిన సర్క్యులర్ల ఎప్పటికప్పుడు పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. అనంతరం కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన మీడియా విభాగంలో ఏర్పాటుచేస్తున్న డిజిటల్ స్క్రీన్లు తదితర ఏర్పాట్లను జేసీ తేజ్‌భరత్‌తో కలసి పరిశీలించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో, జేసీ ఎస్.తేజ్‌భరత్, రాజమండ్రిఅర్బన్ ఆర్వో, మునిసిపల్ కమీషనర్ కే.దినేష్‌కుమార్, కొవ్వూరు ఆర్వో, సబ్‌కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ్, డీఆర్వో జీ.నరసింహులు, రాజానగరం ఆర్వో, ఆర్డీఓఏ.చైత్రవర్షిణి, గోపాలపురం ఆర్వో కె.ఎల్.శివజ్యోతి, అనపర్తి ఆర్వో ఎం.మాధురీ, నిడదవోలు ఆర్వో ఆర్.వి.రమణానాయక్, రాజమండ్రిపార్లమెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్‌డిసి ఆర్.కృష్ణానాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భానుప్రకాష్, పి.సువర్ణ పాల్గొన్నారు.

వరిలో నూతన పరిశోధనలకు శ్రీకారం

- ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు



దివాన్‌చెరువు, జూన్ 1: జిల్లాలోని రైతుల కమతాల్లో ప్రస్తుత పంట సీజన్ నుంచి నూతన పరిశోధనలకు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టబోతున్నారని దివాన్‌చెరువులోని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త చల్లా వెంకటనరసింహారావు ఆదివారం తెలిపారు. రైతులు నాణ్యమైన, స్థిరమైన అధిక ఆదాయం పొందే సాంకేతిక పరిజ్ఞానం, నూతన రకాలను అందించబోతున్నారన్నారు. 2024-25 సంవత్సరానికి రైతుల ప్రయోజనార్థం చేపట్టబోయే పరిశోధన కార్యాచరణను వివరించారు.

నూతన రకాలపై పరిశోధన

రైతులు ఎప్పటి నుంచో సాగు చేస్తున్న కొన్ని రకాలకు ప్రత్యామ్నాయంగా నూతన రకాలను రైతుల ముంగిటనే పరిశోధన చేసి ఫలితాలను విశ్లేషించి సిఫారసు చేస్తామన్నారు. సార్వాలో వరిలో స్వర్ణ(ఎంటీయూ-7029)కు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ-1318 రకం ఇప్పటికే జిల్లాలోని 6700 హెక్టార్లలో సాగు చేస్తున్నారన్నారు. అలాగే ఎంటీయూ-1275, ఎంటీయూ-1310 రకాలను కూడా పరిశీలిస్తామన్నారు. అలాగే బీపీటీ-5204 (సాంబమసూరి)కి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ-1271, బీపీటీ-3082 రకాలను పరిశీలిస్తామన్నారు. ఎక్కువ పోషక విలువలు ఉన్న ఎరుపురంగు బియ్యాన్నిచ్చే బీపీటీ-2858ను, నల్లరంగు బియ్యాన్నిచ్చే బీపీటీ-2841 రకాల సామర్థ్యాన్ని, దిగుబడి, నాణ్యత, చీడపీడలను తట్టుకునే శక్తిని పరిశీలిస్తామన్నారు. అంతేకాక సార్వాలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే దిశలో వరి తర్వాత దాళ్వాలో లాభదాయక పంటలపై పరిశోధన, నూతన కలుపు మందుల మూల్యాంకన, మానిపండు తెగులు యాజమాన్యం, ఎలుకల నివారణకు ఎర-తెర పద్ధతిని పరిశీలించి ఫలితాల అనుగుణంగా సిఫారసు చేయబోతున్నామని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. జిల్లాలో ముఖ్యమైన పంటలైన వరి, మొక్కజొన్నలకు ప్రత్యామ్నాయంగా ఏ మేరకు ఇతర పంటల మార్పిడి జరుగుతుందో అధ్యయనం చేస్తామన్నారు. యూనివర్శిటీ రూపొందించిన వరి రకాల వినియోగం, ధాన్యం కొనుగోలును పరిశీలిస్తామన్నారు. వచ్చే వారం నుంచే కొత్త వరి వంగడాలను ఎంపిక చేసి జిల్లాలోని రైతులకు అందజేస్తామన్నారు. పరిశోధనలకు వచ్చే సార్వా నుంచి శ్రీకారం చుట్టబోతున్నట్టు నరసింహారావు తెలిపారు.

గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో తీసుకోవాలి

- అవంతి ఫీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లూరి వెంకట సంజీవ్
- ముగిసిన ఉచిత వాలీబాల్ శిక్షణ.. ప్రశంసాపత్రాల అందజేత



శిక్షణ పూర్తిచేసుకున్న క్రీడాకారులతో గౌతమీ వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు

కొవ్వూరు, జూన్ 2: గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో తీసుకోవాలని అవంతి ఫీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లూరి వెంకటసంజీవ్ అన్నారు. కొవ్వూరు ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలోని అల్లూరి వెంకటేశ్వరరావు వాలీబాల్ గ్రౌండ్స్‌లో గౌతమీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవంతీ ఫౌండేషన్ సౌజన్యంతో మే నెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఉచిత వాలీబాల్ శిక్షణా తరగతులు ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా వాలీబాల్ గ్రౌండ్స్‌లో జరిగిన సమావేశానికి అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పరిమి హరిచరణ్, సూరపనేని చిన్ని అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటసంజీవ్ శిక్షణ పూర్తిచేసుకున్న క్రీడాకారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. క్యాంపు ఇన్‌చార్జి కొయ్యల ప్రసాద్ మాస్టార్ మాట్లాడుతూ శిబిరంలో శిక్షణ పొందిన మొత్తం 70మంది బాలురు, 10మంది బాలికలకు క్రీడా దుస్తులు, ధ్రువీకరణపత్రాలు అందించామన్నారు. జాతీయ క్రీడాకారిణి కొయ్యల ప్రీతినాగశ్రీకి క్రీడాదుస్తులు, షూస్ అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి గారపాటి రాఘవేంద్రరావు, అభ్యాస స్కూల్ ప్రిన్సిపాల్ పాలడుగుల రఘురామ్, కోచ్‌లు పోసియ్య, జొన్నకూటి సురేష్, వి.అచ్చయ్య, ఉప్పులూరి రాజేష్, ఎం.మణికంఠ, ఆర్.సురేష్, ఎస్.హమీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు కావడం లేదు

- జీడిగింజలకు సరైన ధర లేక రైతుల గగ్గోలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న జీడిగింజలు

నల్లజర్ల, జూన్ 2: జీడిగింజలకు గిట్టుబాటు ధర లేక రైతులు గగ్గోలు పెడుతున్నారు. కౌలుకు తీసుకున్న రైతులకు మరింత నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు కిలో రూ.95 కొనుగోలు చేసిన దళారులు రెండు వారాల నుంచి కిలో రూ.80కే కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో ధర ఉన్న దళారులు అంతా సిండికేట్‌గా మారి గ్రామాల్లో ధరలు తగ్గించినట్టు చెబుతున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో కిలో జీడిపప్పు రూ.600పైగా ఉండగా కనీసం కిలో జీడిగింజలను రూ.100కు కూడా కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఈ ఏడాది కాపు తక్కువగా ఉండి నష్టం రాక వచ్చిన పంటకు గిట్టుబాటు లేక మరింత నష్టపోవలసి వస్తుందని రైతులు చెబుతున్నారు. నల్లజర్ల మండలంలో దూబచర్ల, పుల్లలపాడు, ముసుళ్ళకుంట, చీపురుగూడెం, కవులూరు, పోతవరం, అయ్యవరం గ్రామాల్లో అధికంగా జీడిమామిడి తోటలున్నాయి. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతును ఆదుకోవాలని కోరుతున్నారు.

రాజా వారియర్స్ విజేత

ముగిసిన మునిసిపల్ కాలనీ ప్రీమియర్ లీగ్



రాజా వారియర్స్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2: రాజమహేంద్రవరం మునిసిపల్ కాలనీ గ్రౌండ్స్‌లో జరుగుతున్న మునిసిపల్ కాలనీ ప్రీమియర్ లీగ్ సీజన్ 10 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో రాజా వారియర్స్ జట్టు విజేగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో రాజా వారియర్స్, వాంబే సూపర్ కింగ్స్ జట్లు తలబడ్డాయి. రాజా వారియర్స్ విజేతగా నిలిచింది. గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి రాజా వారియర్స్ జట్టు సభ్యులకు మెమెంటో ఇచ్చి సత్కరించారు. 40 రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్లో వివిధ ప్రాంతాల నుంచి 9 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో నామాన వాసు, బూసి వజ్రనాథ్, నిర్వాహకులు రఫీ, ఉమా, కోట, ఎండీ వజీర్, పురుషోత్తం, నాగార్జున, ఎంఎ రషీద్ పాల్గొన్నారు.

కార్యకర్త మొక్కు తీర్చిన నల్లమిల్లి

బిక్కవోలు, జూన్ 2: అనపర్తి అసెంబ్లీ టికెట్ నల్లమిల్లికి కేటాయిస్తే బిక్కవోలు లక్ష్మీగణపతికి 558 కొబ్బరికాయలు ఆయనతో కొట్టిస్తానని జిల్లా వాణిజ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి గొర్రెల త్రిమూర్తులు మొక్కు కున్నారు. దీంతో ఆదివారం కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులతో 558 కొబ్బరికాయలను ఆయన కొట్టించి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం రామకృష్ణారెడ్డి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

చంద్రబాబును కలిసిన బీజేపీ నాయకురాలు హారిక



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2: రాజమహేంద్రవరానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ కరకట్టలోని బాబు నివాసంలో ఆమె ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి కూటమి విజయం సాధిస్తుందని శుభాకాంక్షలు చెప్పినట్టు ఆమె తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఎంపీగా విజయం సాధిస్తున్నారని చెప్పారు.

సూపర్‌స్టార్ కృష్ణకు స్వరనీరాజనం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 2: సూపర్‌స్టార్ కృష్ణ 81వ జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం విక్రమ్ హాల్లో ఆదివారం రాత్రి శ్రీహరి ఈవెంట్స్ ఆధ్వర్యంలో స్వరనీరాజనాలు అర్పించారు. నా పిలుపే ప్రభంజనం పేరుతో సూపర్‌స్టార్ కృష్ణ, ప్రిన్స్ మహేష్‌బాబు సినిమాల్లో పాటలతో గాయనీగాయకులు అలరించారు. అలనాటి పాటలను మొదలుకొని మహేష్‌బాబు పాటల వరకు రాజమహేంద్రవరానికి చెందిన గాయనీగాయకులు అద్భుతంగా పాడి శ్రోతలను అలరించారు. కార్యక్రమంలో కృష్ణ ఫ్యాన్స్ ఆసూరి సుధాకర్‌రావు, సలీం, ఉమా, పాపారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏ ప్రభుత్వమొచ్చినా ఏమున్నది గర్వకారణం?

- రాష్ట్ర విభజనకు పదేళ్లు.. పోలవరం వదిలేశారు
- ప్రతిపక్షం ఉంటేనే ప్రజాస్వామ్యం ఉంటుంది
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్



రాజమహేంద్రవరం, జూన్2(ఆంధ్రజ్యోతి): ఏప్రభుత్వం వచ్చినా ఇంతే. ఏముంది గర్వకారణం. రాష్ట్ర విభజన జరిగి ఆదివారం నాటికి పదేళ్లు పూర్తయింది. మనం మన ఆస్తిని కూడా తెచ్చుకోలేని అసమర్థులుగా ఉండిపోతున్నాం. ఇక ప్రభుత్వాలు ఎందుకు? అసలు ప్రొసీజర్‌ను పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ వ్యాఖ్యానించారు. రాజమహేంద్రవరం ధర్మంచర హాల్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రతిపక్షం కూడా బలంగా ఉండాలి. అప్పుడే ప్రజాస్వామ్యం ఉంటుందన్నారు. తెలంగాణ ప్రజలు ఆవిర్భావ దినోత్సవ ఉత్సాహంతో ఉంటే, మనం దశాబ్ది గోసతో బాధపడుతున్నామన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని వాటితోపాటు రాష్ట్రానికి రావలసిన వాటాను కోటా పొందడంలో ప్రస్తుతం విఫలమయ్యామన్నారు. 2014-15లో కేంద్ర ప్రభుత్వం 32,625 కోట్ల ఆర్థిక లోటును భర్తీ చేయవలసి ఉంది. కానీ 5,615 కోట్లే వచ్చింది. పోలవరం ప్రాజెక్టు 48శాతం మాత్రమే పూర్తయింది. ఇది రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. ఇక కేవలం 521 కోట్లు మాత్రమే పోలవరానికి బాకీ ఉన్నట్టు కేంద్రం స్పష్టం చేసిందని వివరించారు. ఇక వెనుకబడిన ప్రాంతాలు, వివిధ ప్రాజెక్టుల కింద ఏడేళ్లలో 1500 కోట్లు ఇచ్చారు. కానీ ఇంకా 3,520 కోట్లు రావలసి ఉంది. దీనికి కారణం రాష్ట్రంలో కేంద్రం మీద ఒత్తిడి చేసే ప్రభుత్వమే లేదన్నారు. తెలంగాణ నుంచి ఏపీకి 1,28,000 కోట్ల విలువైన ఆస్తులు రావాలి. సుమారు 1,60,000 మంది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏ రాష్ట్రం ఇవ్వాలో అర్థం కాని పరిస్థితిలో వారు నష్టపోయారని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి ఇవి సాధించుకోవడానికి సరైన సమయం అని ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు.

దేశ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 2: అన్ని రంగాల్లో భారతదేశం సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నదే లక్ష్యమని భారత్ వికాస్ సౌత్ జనరల్ సెక్రటరీ పురుషోత్తమ్‌శాస్త్రి అన్నారు. హోటల్ సూర్యలో పరిషత్ రాజమహేంద్రవరం 4శాఖల ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి ఎంపికైన నూ తన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం నిర్వహిం చారు. 1963లో సంస్థ ఆవిర్భవించిందన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పరిషత్ సభ్యులు జీబీవీ సుబ్రహ్మణ్యం, తాడేజీ సాయికృష్ణ, కొత్తపల్లి వీర్రాజు, పీవీ ఎస్.కృష్ణారావు, డాక్టర్ జయప్రద, సత్తి మూలారెడ్డి, డాక్టర్ అనురాధ పాల్గొన్నారు.

చదరంగంతో ఏకాగ్రత, చురుకుదనం



చెస్ పోటీల్లో ఆడుతున్న చిన్నారులు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 2 : చదరంగం ఆడడం వల్ల ఏకాగ్రత, చురుకుదనంతో పాటు రోజంతా ఉల్లాసంగా ఉంటారని కాల్ ఫ్యూషన్ చెస్ అకాడమి డైరెక్టర్ కుమార్ విత్తనాల అన్నారు. రాజమహేంద్రవరం కాల్‌ఫ్యూషన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం చదరంగం పోటీలు జరిగాయి. అకాడమీ ఎండీ లక్ష్మీ హైమావతి మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో నెలరోజులపాటు శిక్షణ పొందిన అండర్ - 6 నుంచి 18 ఏళ్లలోపు క్రీడాకారులకు అంతర్గత పోటీలు నిర్వహించామన్నారు. అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన 55 మందికి బహుమతులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మెడల్ ప్రశంసాపత్రం అందజేసినట్టు తెలిపారు. మనోహర్, శివప్రసాద్, రాజ్‌కుమార్, దివ్య, సౌమ్య, గౌరవ్, కుమార్ రాజా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	లవ్ మీ
వై.స్క్రీన్2	గంగం గణేశా
దేవిశ్రీ(గాయత్రి)	భజే వాయువేగం
అనన్య	గ్యాంగ్ ఆఫ్ గోదావరి
నిడదవోలు	
వీ మ్యాక్స్	గంగం గణేశా
రాధాకృష్ణ	భజే వాయువేగం
శ్రీగణపతి	గ్యాంగ్ ఆఫ్ గోదావరి
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి